ప్రతి అక్షరం - ప్రజల పక్షం

# తెలంగాణ చేతనం

తెలుగు దినపత్రిక

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 9 | 254 | ఎడిటర్ : శ్రీనివాస్ | ఆదివారం 6.04. 2025 | పేజీలు :8 | వెల: 5

విలేకరులు కావలెను

తెలంగాణ చేతనం తెలుగు దినపత్రిక తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ & ఆంధ్రప్రదేశ్) ప్రజాదరణ పొందుతున్న తెలంగాణ చేతనం తెలుగుదినపత్రికలో పని చేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు, అడ్వర్టైజ్మెంట్ స్టాఫ్ కావలెను.

సంప్రదించవలసిన నెంబర్స్

9010899869, 9885355955

Mail ID : telanganachethanam@gmail.com



## మావోయిస్ట్ లకు భారీ ఎదురుదెబ్బ 86 మంది నక్సల్స్ లొంగుబాటు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: తెలంగాణాలోని మావోయిస్ట్ లకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్ర పురం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో 86 మంది మావోయిస్టులు లొంగిపోయారు.. వీరిలో 66 మంది పురుషులు 20 మంది మహిళలు ఉన్నారు.. మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి నేడు జరిగిన విలేకరుల సమావేశంలోఈ వివరాలు వెల్లడించారు.. ఈ ఏడాది మొత్తం 224 మంది మావోయిస్టులు లొంగిపోయారనీ పేర్కొన్నారు. ఇంకా 290 మంది మాత్రమే తెలంగాణలో యాక్టివ్ గా ఉన్నారని వారు కూడా జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు వారికీ ప్రభుత్వం తరుపున పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు%ొ% ఈ రోజు లొంగిపోయిన వారిలో ఏరియా కమాండర్ లు నలుగురికి 4 లక్షలు, పార్టీ మెంబెర్స్ కు లక్ష రూపాయలు, మిగిలిన వారికి 25 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు..

## యువతులతో డ్రగ్స్ డెలివరీ.. ముఠా వివరాలు వెల్లడించిన సందీప్ శాండిల్య



హైదరాబాద్: విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును ఈ ముఠా విదేశాలకు తరలిస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు నైజీరియన్లను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. గత 3 నెలలకు పైగా ఈ ముఠాపై నిఘా పెట్టినట్లు చెప్పారు. డ్రగ్స్ తీసుకున్నాక నగదు చెల్లింపులు జరుపుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వీటిని డెలివరీ చేసేందుకు అమ్మాయిలను ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందని పేర్కొన్నారు. టోలీచౌకి ప్రాంతంలో డ్రగ్స్ డెలివరీ చేసిన యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేసినట్లు వివరించారు. ముఠా సభ్యులు ఆ యువతికి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు “గత 5 సంవత్సరాలుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించాం. భారత్‌తో పాటు అమెరికాలో నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నాం. కస్టమర్లు డబ్బులు చెల్లించేందుకు 15 మంది యువతుల బ్యాంక్ ఖాతాలు ఇచ్చారు. 5 సంవత్సరాల్లో డ్రగ్స్ కోసం భారత్-అమెరికా-నైజీరియన్ల మధ్య కోట్ల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు తేల్చాం. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా.. మొదట భారత్‌కు పంపిస్తారు. ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు తీసుకెళ్తారు. డ్రగ్స్ మొత్తం విదేశాల్లోనే తయారు అవుతున్నాయి. మన దేశంలో చాలా తక్కువ తయారవుతున్నట్లు గుర్తించాం. ఫారెక్స్ ఏజెంట్ల సహకారంతో నైజీరియన్లు డబ్బులను విదేశాలకు తరలిస్తున్నారు.” అని సందీప్ శాండిల్య చెప్పారు.

## తమిళ జాలర్లు, బోట్లను విడిచిపెట్టండి: శ్రీలంకను కోరిన ప్రధాని మోదీ



శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తమిళ జాలర్ల సమస్యను లేవనెత్తారు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు. తమిళ జాలర్లను వెంటనే విడుదల చేయాలని, వారి పడవలను విడిచిపెట్టాలని కోరారు. రెండు దేశాల మధ్య ఏన్నో ఏళ్లుగా ఈ అంశం నలుగుతోంది. దానికి పరిష్కారం చూపే దిశగా తాజా పర్యటనలో చర్చలు జరిగాయి (%వీశీఎఱ ాతీఱ ాఖుఅఎు ఒఱంట్).

మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే ఉందని ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం పలుమార్లు వెల్లడించింది. మోదీ శ్రీలంక పర్యటన నేపథ్యంలో ఇటీవల దీనిపై అభ్యర్థనలు చేసిన సంగతి తెలిసిందే. కచ్చతీవు వద్ద రాష్ట్ర జాలర్లు చేపలు పట్టేందుకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్ తెలిపారు. తమ రాష్ట్ర మత్స్యకారులను భారతీయ జాలర్లుగా కేంద్రం చూడాలన్నారు. కచ్చతీవులో చేపలు పట్టడానికి వీలుగా శ్రీలంకతో కొత్త ఒప్పందం అవసరమన్నారు. 2010 తర్వాత శ్రీలంక- భారత్ మధ్య జాలర్ల అంశంపై చర్చలు జరపలేదన్నారు. ఈ క్రమంలోనే తాజాగా మోదీ దీనిపై అభ్యర్థన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రధాని మోదీకి శ్రీలంక ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ద్వీపదేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ‘శ్రీలంక మిత్ర విభూషణ’ పురస్కారాన్ని అందజేశారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ప్రధాని ఆ దేశంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. థాయ్‌లాండ్‌లో బిమ్‌స్టెక్ సదస్సు ముగిసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ప్రధాని మోదీ నేరుగా అక్కడకు చేరకున్నారు. బండారునాయకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగిన ఆయనను లంక ప్రభుత్వం ఘనంగా స్వాగతించింది. శనివారం ఉదయం ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు సంప్రదాయ పద్ధతుల్లో ఆహ్వానం పలికారు. ఇరుదేశాల మధ్య ఉన్న చరిత్రాత్మక సంబంధాలకు ప్రతీకగా ఈ స్వాగతం నిలిచింది. ఇక రెండు దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సంతకాలు జరిగాయి.

# ఏఐతో ఫేక్ ఇమేజెస్..

## రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా ద్వారా కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. కంచె గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25 లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు.ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్‌లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలను నిర్మించారు. వాటిని నిర్మించే సందర్భాల్లో ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని అంశంపై సమావేశంలో చర్చ జరిగింది.అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు వివరించారు.వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సమావేశంలో వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు.ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డిలతో పాటు సినీ ప్రముఖులు ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారన్న చర్చ సమావేశంలో జరిగింది.కంచె గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఇదే తరహాలో ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే పెను ప్రమాదముంటుందని చర్చ జరిగింది.మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్‌ను గుర్తించడానికి అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.



## రజతోత్సవ సన్నాహాలు.. బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ సమావేశాలు

పార్టీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సిద్ధిపేట జిల్లాలోని ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సన్నాహక సమావేశాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఈరోజు (శనివారం) సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మూడు ఉమ్మడి జిల్లాలైన నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ నేతలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 27న జరిగే సిల్వర్ జూబ్లీ సభ ఏర్పాట్లపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. “ఒకప్పుడు తెలంగాణను విఫల ప్రయోగం అని పిలిచిన శక్తులే.. ఇప్పుడు అధికారంలో ఉన్నాయని కేసీఆర్ అన్నారు. తమ సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వం తమ ఇష్టానుసారం వ్యవహరిస్తే, కోర్టులు, పౌర సమాజం, విద్యార్థుల నుండి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని కేసీఆర్ అన్నారు. దానికి ప్రస్తుత %ఎజఖ% వివాదం ఒక ఉదాహరణ అని కేసీఆర్ పేర్కొన్నారు.

సర్పంచ్ హెూదాలో ఉన్న వ్యక్తి కూడా ప్రజలకు మంచి చేయాలని ప్రయత్నిస్తారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మెప్పించే ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత, నిజాయితీ, పరిపాలనా సంకల్పం లేకపోవడం వల్ల తెలంగాణలో పరిస్థితి దిగజారుతోందన్నారు.

కాంగ్రెస్ ప్రాథమిక అవసరాలైన సాగునీరు, తాగునీరు, విద్యుత్తును అందించడంలో విఫలమైందని, రైతులకు ఎలాంటి మేలు జరగడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో పంచాయతీ, మునిసిపల్ పాలన కుప్పకూలిందని అన్నారు. కాంగ్రెస్ డైవకర్షన్ పాలిటిక్స్ కు బీఆర్ఎస్ నేతలు రెచ్చిపోకూడదని, వారి కుతంత్రాలను ప్రజలు అర్థం చేసుకుంటారని కేసీఆర్ అన్నారు.

# మజ్లీస్ పార్టీని స్థానిక ఎన్నికలలో ఓడిస్తాం

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ - కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మజ్లిస్ పార్టీకి బానిసలుగా మారిపోయాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ నగరాన్ని మజ్లిస్ పార్టీకి అప్పగించారని ఆరోపించారు. మజ్లిస్ పార్టీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. దివంగత నేత బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నేడు ఎల్ బి స్టేడియం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కిషన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా జగ్జీవన్ దేశానికి సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు తమదే అని ధీమా వ్యక్తం చేశారు. తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారని.. కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారని చెప్పారు. ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారిందన్నారు. అందులో భాగంగానే ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఎవరు ఉంటే వాళ్లతో అంటకాగి హైదరాబాద్‌ను దోచుకోవడం ఎంఐఎంకు పరిపాటి అయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఎంఐఎం కోటలు బద్దలు కొడతామని స్పష్టం చేశారు. సంఖ్యా బలం ఉంటే బీజేపీనే గెలిచేదని.. సంఖ్యా బలం లేదు కాబట్టే ఓటింగ్ జరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో 120 మంది ఓటర్లు ఆచితూచి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా, హిందువులకు, హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చే పార్టీ మజ్లిస్ పార్టీ అంటూ మండిపడ్డారు. గతంలో హైదరాబాద్‌లో అనేక సార్లు మతకలహాలు ప్రేరింపించిందన్నారు. అలాంటి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ చేయకుండా ఉండటం రాజకీయ కుట్రే అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కూడా ఎంఐఎంకు బానిసత్వంతో ఉండే పార్టీలని వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీని పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ కనుసైగలో ఈ రెండు పార్టీలు నడుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ కూడా ఎంఐఎం పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతూ పెంచి పోషిస్తున్నాయన్నారు. మజ్లిస్‌కు ఓటేస్తే ప్రజలెవరూ కూడా క్షమించరని అన్నారు.హైదరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఈసారి కచ్చితంగా హైదరాబాద్ నగరంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని.. మేయర్ పీఠం మీద కూర్చోబోయేది భారతీయ జనతా పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలకు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధం లేదని అన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి మజ్లిస్ పార్టీని ఓడించాలని%ొ% బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. పార్టీలో అంతర్గత విబేధాలు ఉండటం సహజమని చెప్పుకొచ్చారు. అలాంటివి ఏవైనా ఉంటే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్‌కు రేవంత్, భట్టి నివాళి ..



హైదరాబాద్ -దివంగత నేత బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ లు ఘనంగా నివాళులర్పించారు.. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు..హైదరాబాద్ లోని బషీర్ బాగ్ లో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో కలసి రేవంత్ పూల మాల వేసి నివాళులర్పించారు..ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, జగ్జీవన్ జయంతిని స్మరిస్తూ జరుపుకునే ‘సమానత్వ దినోత్సవం’ సందర్భంగా సామాజిక సాధికారత కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ లో నేడు జరిగిన కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ . ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరమోధుడిగా, ఉప ప్రధానిగా, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సమ సమాజ దార్శనికుడిగా జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు మహెూన్నతమైనవని కొనియాడారు.

చిన్ననాటి నుంచే వివక్షను ఎదుర్కొన్న ఆయన కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని కేసీఆర్ చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలంగా పాల్గొన్నారని%ొ%. అనంతరం దేశ స్వయంపాలనలో కేబినెట్ మంత్రిగా కార్మిక శాఖలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారని కితాబునిచ్చారు. దేశ రక్షణ, వ్యవసాయం, టెలి కమ్యూనికేషన్స్ శాఖలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని చెప్పారు. ఉప ప్రధానిగా దేశానికి ఎంతో సేవ చేశారని అన్నారు. ఆయన జయంతిని సమతా దివస్ గా జరుపుకోవడం%ొ% జాతి కోసం వారు చేసిన సేవలకు దర్పణంగా నిలుస్తుందని అన్నారు. అంటరానితనం, కులం పేరుతో కొనసాగుతున్న సామాజిక వివక్ష సంపూర్ణంగా సమసిపోయే దిశగా మనందరం పని చేసినప్పుడే బాబు జగ్జీవన్ రామ్ కు ఘనమైన నివాళి అర్పించిన వారమవుతామని చెప్పారు.

## ఆఫీసు స్పేస్ లీజింగ్ తిరోగమనం



హైదరాబాద్ - కొత్త ఐటీ పార్కులను ప్లాన్ చేయడానికి ముందు తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఆఫీస్ లీజింగ్‌లో 41 శాతం క్షీణతను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సూచించారు..జనవరి-మార్చి క్వార్టర్‌లో ఇప్పటివరకు నమోదైన లావాదేవీల ఆధారంగా రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ ‘కొలియర్స్ ఇండియా’ విడుదల చేసిన నివేదికలో దేశంలో తొలి 3 నెలల్లో ఆఫీస్ లీజింగ్ మెరుగైన వృద్ధిని సాధించగా హైదరాబాద్, కోల్ కతాల్లో మాత్రం క్షీణత కనిపించిదని ఈ నివేదిక పేర్కొంది. దీనిపై కెటిఆర్ తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందిస్తూ, ఈ తిరోగమణం దేశవ్యాప్తం జరుగుతున్నదని కాదని బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్ సీఆర్, ముంబయి, పుణే వంటి నగరాలు గణనీయమైన వృద్ధిని సాధిస్తుంటే.. హైదరాబాద్ మాత్రం తిరోగమనంలో ఉందని గుర్తుచేశారు. గతంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉండేదని.. ఇప్పుడు క్షీణించడంపై ప్రభుత్వం తన పనితీరుపై ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.ఈ విషయంలో ఒక కమిటీని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు.

# తయారీలో సమస్యలు..!

## మందులు రీకాల్ చేసుకుంటున్న ఫార్మా కంపెనీలు

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్, సన్ ఫార్మా, అరబిందో ఫార్మా, ఎఫ్‌డీసీ కంపెనీలు అమెరికా నుంచి కొన్ని మందులను రీకాల్ చేసుకుంటున్నాయి. యూఎస్ ఎఫ్‌డీఏ డేటా ప్రకారం, తయారీలో సమస్యలు ఉండడంతో మందుల రీకాల్ చేపడుతున్నాయి. బ్లడ్ ఫెనైలలనైన్ కంట్రోల్ చేయడంలో వాడే జావైగ్టర్ (సాప్రోప్టెరిన్ డైహైడ్రోక్లోరైడ్) పౌడర్ (100 ఎంజీ) 20,000 కార్టన్లను డాక్టర్ రెడ్డీస్ రీకాల్ చేసుకుంటోంది. ఈ మెడిసిన్స్ సమర్థత అనుకున్నదాని కంటే తక్కువగా ఉండడంతోనే రీకాల్ చేపడుతోంది. ఇదే కారణంతో మరికొన్ని లాట్‌ల సాప్రోప్టెరిన్ డైహైడ్రోక్లోరైడ్ డ్రగ్‌ను రీకాల్ చేస్తోంది. కిందటి నెల 8 న డాక్టర్ రెడ్డీస్ క్లాస్1 రీకాల్ మొదలుపెట్టిందని యూఎస్ ఎఫ్‌డీఏ ప్రకటించింది. ప్రొడక్టులు సరిగ్గా లేకపోతే క్లాస్ 1 రీకాల్ చేపడతారు. ఇంజెక్షన్లలో వాడే 11,016 వయల్స్ అంఫోటెరిసిన్ బీ లిపోసమ్ డ్రగ్‌ను యూఎస్ నుంచి సన్ ఫార్మా రీకాల్ చేసుకుంటోంది. ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్‌ను ట్రీట్ చేయడంలో ఈ మందును వాడుతున్నారు. సన్ ఫార్మా యూఎస్ సబ్సిడరీ క్లాస్ 2 రీకాల్‌ను కిందటి నెల 19 న మొదలు పెట్టింది. అదే విధంగా అరబిందో ఫార్మా 13,605 బాటిళ్ల క్లోరజెపటే డైపొటాషియం ట్యాబ్లెట్లు (3.75 ఎంజీ, 7.5 ఎంజీ) రీకాల్ చేస్తోంది. ట్యాబ్లెట్లపై పసుపు మచ్చలు ఉ




ండడంతో ఈ డ్రగ్‌ను కంపెనీ రీకాల్ చేస్తోంది. కిందటి నెల 24 న క్లాస్ 2 రీకాల్‌ను అరబిందో ఫార్మా మొదలు పెట్టింది. మరో ఫార్మా కంపెనీ ఎఫ్‌డీసీ లిమిటెడ్ 3,82,104 యూనిట్ల టిమోలోల్ మలియేట్ ఆఫ్తాల్మిక్ సొల్యూషన్‌ను రీకాల్ చేస్తోంది. ఈ మందును గ్లూకోమా ట్రీట్‌మెంట్‌లో వాడుతున్నారు. కంటైనర్‌లో సమస్యలు ఉండడంతో ఈ కంపెనీ డ్రగ్స్‌ను రీకాల్ చేసుకుంటోంది. కాగా, మందుల ప్యాకింగ్ బాగోలేకపోతే క్లాస్ 2 రీకాల్‌ను చేపడతారు.

# వసతులు సరే.. మరి స్వచ్ఛత..?

రాజపేట:సర్కారు బడుల్లో విద్య బలోపేతానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నందున సకల సదుపాయాలు కల్పించాలని ముందస్తు ప్రణాళికలు రచించి కార్యాచరణ చేపడుతోంది. ప్రతి పంచాయతీకి ఒక బడి ఉండాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో గతంలో మూతబడిన పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలోనే సర్కారు పాఠశాల విద్యార్థులకు తొలిరోజే ఏకరూప దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాలు అందజేసే కార్యక్రమానికి పూనుకోవడం విశేషం. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 3,210 పాఠశాలలుండగా అందులో సుమారు 2.11 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఉపపోరు ముగిసిన నేపథ్యంలో బడిబాట కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ షెడ్యూల్ ప్రకారం గత నాలుగు రోజులుగా చురుకుగా కొనసాగిస్తోంది. అంతా బాగానే ఉన్నా పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికుల నియామకంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడం విచారకరం. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తొలిరోజే సర్వాంగ సుందరంగా, సకల సౌకర్యాలతో విద్యార్థులను ఆకర్షించేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. సర్కారు బడుల్లో మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పలు వసతులతో పాటు మరమ్మతులు చేపడుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, గదుల్లో ఫ్యాన్లు, బెంచీలు, బోర్డులు, డ్యూయల్ డెస్కులు, డైనింగ్‌హాల్స్ నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. మరికొన్ని ఈపాటికే



పూర్తయ్యాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి సదుపాయాలు కల్పించిన బడుల్లో.. స్వచ్ఛత కార్మికుల నియామకం ప్రత్యేకంగా చేపట్టకపోవడంతో పాఠశాలల్లో పారిశుద్ధ్యం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2020వ సంవత్సరంలో పాఠశాలల్లో స్వచ్ఛత కార్మికుల వేతనాలను స్థానిక పంచాయతీలే భరించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో కొన్ని ప్రాంతాల్లో సకాలంలో పంచాయతీలు స్వచ్ఛత కార్మికులకు వేతనాలు చెల్లించగా.. మరికొన్ని చోట్ల ఆర్థికభారంతో చెల్లించలేక కొన్ని పంచాయతీలు చేతులెత్తేశాయి. స్వచ్ఛ కార్మికులు తమ విధులను చేయకపోవడం, నామమాత్రంగా చేపట్టడం జరుగుతుందనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా పాఠశాలల సమయంలో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అధిగమించేందుకు కొన్ని చోట్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులే స్వచ్ఛత పనులు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి.

# రికార్డు స్థాయిలో లాభాలు..
# ఉద్యోగులకు బోనస్‌గా 8 నెలల జీతం




న్యూఢిల్లీ: ఆశించిన దానికంటే అధికంగా లాభాలు రావడంతో ఎనిమిది నెలల జీతానికి సమానమైన మొత్తాన్ని బోనస్‌గా ఇవ్వాలని సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్ణయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆ విమానయాన సంస్థ రికార్డు స్థాయిలో 1.98 బిలియన్ డాలర్ల నికర లాభం ఆర్జించింది. దీంతో లాభాల్లో కొంత భాగాన్ని ఉద్యోగులకు బోనస్ రూపంలో చెల్లించనున్నట్లు సంస్థ ప్రకటించింది. కరోనా మహమ్మారి వల్ల మూతపడిన చైనా, హాంకాంగ్, జపాన్, తైవాన్ సరిహద్దులు ఏడాది క్రితం పూర్తిస్థాయిలో తెరచుకోవడంతో ఇది సాధ్యమైందని ఎయిర్‌లైన్ ఆర్థిక నివేదిక వెల్లడించింది. ఏడాది పొడవున విమాన ప్రయాణాలకు డిమాండ్ ఏర్పడిందని పేర్కొంది.

గతేడాది సింగపూర్ ఎయిర్‌వేస్ ప్రపంచంలోనే అత్యుత్తమ విమానయాన సంస్థగా ది స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌లైన్ అవార్డును సొంతం చేసుకుంది. దీంతో గత 23 ఏండ్లలో సింగపూర్ ఈ పురస్కారన్ని గెలుచుకోవడం ఇది ఆరోసారి. ఉద్యోగుల అవిశ్రాంత కృషి ఫలితంగానే ఈ అవార్డు దక్కిందని సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీఈఓ గో చూన్ ఫాంగ్ అన్నారు. ఎయిర్ ట్రావెల్‌లో మరింత పుంజుకోవడానికి ఇది సహాయపడుతుందని చెప్పారు. కాగా, ఎమిరేట్స్ గ్రూప్ కూడా తమ ఉద్యోగులకు 20 వారాల జీతాన్ని బోనస్‌గా ప్రకటించింది. మే నెల జీతాలతో ఈ మొత్తాన్ని చెల్లించనున్నట్లు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించినట్లు తెలిపింది.

# విద్యుత్తు నియంత్రికల ధ్వంసం



నల్గొండ :విద్యుత్తు సరఫరాలో కీలకమైన నియంత్రికలను నల్గొండ జిల్లాలో కొన్నాళ్లుగా గుర్తు తెలి యని దుండగులు ధ్వంసం చేస్తున్నారు. రూ.లక్షల విలువైన నియంత్రికలు చెడిపోవడంతో సంస్థపై పెనుభారం పడుతోంది. మరో పక్క రైతులకు, వినియోగదారులకు కరెంటు సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. ఇలాంటి ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నా విద్యుత్తు యంత్రాంగం చోద్యం చూస్తోంది. దుండగుల ఆగడాలు జిల్లాలో రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. 25 కేవీ విద్యుత్తు నియంత్రిక విలువ సుమారు రూ.1.03 లక్షలు ఉంది. అందులో ఐదు కిలోలకు పైగా రాగి తీగతో పాటు 25 లీటర్లకు పైగా ఆయిల్ నింపి ఉంటుంది. సదరు దొంగలు మాత్రం రాగి తీగ, ఆయిల్‌ను లక్ష్యంగా చేసుకుని ధ్వంసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ప్రధానంగా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో భారీ స్థాయిలో అపహరణ చోటు చేసుకుంటోంది. దామరచర్ల మండలంలో -27, త్రిపురారం-12, అడవిదేవులపల్లి-3, నిడమనూరు-3, జిల్లా కేంద్రమైన నల్గొండ వల్లభరావు చెరువు సమీపంలో,నకిరేకల్ నియోజకవర్గాల్లో-2 చొప్పున విద్యుత్తు నియంతికలు విధ్వంసానికి గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని విద్యుత్తు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ప్రధానంగా జాతీయ, రాష్ట్ర రహదారులు పక్కన ఏర్పాటు చేసిన నియంత్రికలతో పాటు, వ్యవసాయ పొలాల్లో ఉన్న 25 కేవీ సింగిల్ ఫేజ్ నియంత్రికలను లక్ష్యం చేసుకుని ధ్వంసం చేస్తున్నారు. చిల్లర దొంగల పనా... లేక ఇంటి దొంగల హస్తం ఉందా.. అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసి వదిలేస్తున్నారు. కానీ రక్షణ చర్యలు తీసుకోవడంలో మాత్రం విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వీటికి ఎవరు రక్షణగా ఉండాలి.. పోలీసులా... లేక విద్యుత్తు అధికారుల అనే మీమాంస ప్రజల్లో నెలకొంది.

విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం నియంత్రికల పరిధిలోని వినియోగదారులు రక్షణ బాధ్యత చూసుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసిన దొంగలను పట్టుకునేలా చర్యలు చేపట్టాం. అయినా కొన్ని ప్రాంతాల్లో దుండగులు వాటి హెడ్జ్ ఫీజులను కర్రలతో కొట్టి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు.

మరో ప్రాంతంలో విద్యుత్తు నియంత్రిక వద్ద ఉన్న ఆన్‌ఆఫ్‌స్విచ్ ఉపయోగించి విద్యుత్తు నిలిపివేసి అందులో ఆయిల్, రాగి తీగలు అపహరిస్తున్నారు. నియంత్రికను ఎందుకు పనికి రాకుండా విధ్వంసం చేస్తున్నారు. ఈ విషయంపై విజిలెన్స్‌కు, పోలీసులకు మా సిబ్బంది ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

# అసంపూర్తి పనులు..
# మౌలిక వసతుల కరవు..?

పెద్దపల్లి :సుల్తానాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి కింద రూ.20 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు నిర్మాణం గోడలకే పరిమితమైంది. పెద్దపల్లి పట్టణం మచిలిఖేడ ప్రాథమిక ఉర్దూ పాఠశాల ముందు మురుగు నీటి దుర్వాసన విద్యార్థులను అనారోగ్యానికి గురి చేస్తోంది. ఇక్కడ 24 మంది విద్యార్థులుండగా అమ్మ ఆదర్శ కమిటీలో వంటశాల, మూత్రశాలల నిర్మాణం గోడలకే పరిమితమైంది. పట్టణంలోని మురుగు నీరు ఈ కాలువ నుంచే ప్రవహిస్తోంది. ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. శ్మశాన వాటిక సమీపంలో బడి ఉండటం శవాలను కాల్చివేసే సమయంలో గదుల్లోకి పొగ వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా 'మన ఊరు-మన బడి' పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జిల్లాలో 539 పాఠశాలల్లో 26,215 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి,ఆట స్థలాలు అందుబాటులో లేవు. బడుల్లో ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వేసవి సెలవుల తర్వాత నేడు



పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం మన ఊరు-మన బడి కింద 191 పాఠశాలల్లో రూ.కోట్ల నిధులతో హడావుడిగా పనులు ప్రారంభించినా పావలా వంతు ప్రగతి పూర్తికాలేదు. మండలానికి రెండు ఆదర్శ పాఠశాలల్లో నిర్మాణం తప్పా మిగిలిన చోట్ల ముందడుగు పడలేదు. నిధుల కొరత, ఇతర కారణాలతో ప్రగతి ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల 531 పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో చేస్తున్న ప్రగతిలో అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది.

# ఖరీఫ్ సాగుకు ప్రణాళిక

ములుగు: వారం రోజుల్లో రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించనున్న నేపథ్యంలో పంటల సాగుపై కార్యాచరణకు జిల్లా వ్యవసాయశాఖ సిద్ధమవుతోంది. వ్యవసాయానికి ములుగు జిల్లా పెట్టింది పేరు. ఈ జిల్లాలో పరిశ్రమలు, ఇతర వాణిజ్య వ్యాపారాలు తక్కువగా ఉండటంతో.. ఇక్కడి ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి మొక్కజొన్న పంటలు పండిస్తుంటారు. త్వరలో ఖరీఫ్ ఆరంభం కానుండగా రైతులకు సేద్యంపై దిశా నిర్దేశం చేసేందుకు వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సాగు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఎంత మోతాదులో ఎరువులు, విత్తనాలు అవసరమవుతాయనేది కూడా అంచనా వేశారు. జిల్లా పరిధిలోని మొత్తం 1,77,670 ఎకరాల్లో సేద్యం జరుగుతుందనేది అధికారుల అంచనా. ఈ భూముల్లో సుమారు 85,990 మంది రైతులు వివిధరకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి, పత్తి, మిర్చి, జొన్నలు, మొక్కజొన్న, వేరు శనగ, మినుములు, పెసలు, కందులు, తదితర మొదలగు పంటలు పండిస్తున్నారు.

అత్యధికంగా చెరువులు, కుంటల ఆధారంగానే జిల్లాలో సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,42,116 ఎకరాల్లో సాగు చేస్తారనేది అంచనా. ఇందులో 1,12,180 ఎకరాల్లో వరి సేద్యం జరుగుతుందని వ్యవసాయాధికారుల అంచనా.మిగతా భూమిలో పత్తి,



మిరప, మొక్కజొన్న, తదితర పంటలు వేసే అవకాశాలున్నాయి. పంటల సాగుకు ఎరువులు అవసరం ఉంటాయనే దానిపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వానాకాలం పంటల సాగు విస్తీర్ణం అంచనాలు సిద్ధం చేసాం. పంటల సాగుపై పురుగు మందులు వాడ కుండా జిల్లా పరిధిలోని రైతులకు అవగాహన కల్పిస్తాం. ఈ సేద్యంపై కర్ష కులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, పురు గు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

# దక్షిణాదిల్లో వన్యప్రాణుల గణన



తిరువనంతపురం: దక్షిణ భారతదేశం అంతటా (కర్ణాటక, తమిళనాడు,కేరళ,తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో) మే 23 నుంచి 25వరకు ఏనుగుల గణన జరగనుంది. కేరళ, తమిళనాడు మరియు కర్ణాటకలతో కూడిన అంతర్-రాష్ట్ర సమన్వయ కమిటీ తీర్మానాలను రూపొందించింది. దానిలో ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా మానవ-వన్యప్రాణుల విభేదాలను పరిష్కరించడం కీలకలక్ష్యంగా పెట్టుకుంది. సహకార కసరత్తులో ఆంధ్రప్రదేశ్ కూడా చేరనుంది. నాలుగు రాష్ట్రాల అటవీ శాఖల అధిపతులు ఇటీవల ఆన్‌లైన్‌లో సమావేశమై జనాభా గణన ప్రక్రియపై చర్చించారు. గణన మొదటి రోజు బ్లాక్ కౌంట్ శాంప్లింగ్ (లేదా డైరెక్ట్ కౌంట్)పద్ధతితో ప్రారంభమవుతుంది, ఇక్కడ అటవీ డివిజన్‌లను 4 నుండి 6 చదరపు కిలోమీటర్ల వరకు నమూనా బ్లాక్‌లుగావిభజించారు. రెండవ రోజు, పరోక్ష 'పేడ గణన' (లేదా లైన్ ట్రాన్సెక్ట్) పద్ధతిని అమలు చేస్తారు. ఏనుగు పేడ సాంద్రత మరియు ఏనుగుల నుండి దాని దూరాన్ని (లేదా డేటా సేకరణ కోసం కాలినడకన 2 కి.మీ వరకు ఉన్న సరళ రేఖలు) ఆధారంగా ఏనుగు సంఖ్యలను అంచనా వేస్తారు. మూడవ రోజు వాటర్‌హోల్ కౌంట్ పద్ధతిపై దృష్టిసారిస్తారు. ఏనుగులు తరచుగావచ్చే నీటి వనరులను గుర్తిస్తారు. కేరళలో, తమిళనాడు మరియు కర్ణాటక సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేకశ్రద్ధతో అనముడి,నిలంబూర్,పెరియార్ మరియు వాయనాడ్ఏనుగులరిజర్వ్‌ల మీదుగా దాదాపు 610శాంపిల్‌బ్లాక్‌లను ఏనుగుల గణనఅంచనా వేయనున్నట్లు చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ డి.జయప్రసాద్‌తెలిపారు. వివిధ ప్రాంతాలలో నీటి గుంటల వైపు ఏనుగుల కదలికను కూడా అంచనా వేస్తుంది. జూన్ 23లోగా ప్రాథమిక నివేదికను రూపొందించి,జూలై 9లోగా తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. గత సంవత్సరం అంచనా బ్లాక్ కౌంట్ మరియు పేడ గణన పద్ధతులు వరుసగా 1,920 మరియు 2,386 ఏనుగులను నమోదు చేశాయి, 2017లో (వరుసగా 3,322 మరియు 5,706) గణనల కంటే చాలా తక్కువ.

# రియల్ ఎస్టేట్ రంగంపై పెను ప్రభావం

అమెరికాలో రియల్ ఎస్టేట్ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకొన్న ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, భారీ భవంతులు, ఆఫీసు స్థలాలు విక్రయాలు లేక ఘోస్ట్ హౌస్‌లుగా మారుతున్నాయి. అమ్మకాలు భారీగా పతనమవ్వడంతో రియల్టర్లు డిస్కౌంట్ల బాట పడుతున్నారు. 50 శాతం మేర రాయితీ ప్రకటిస్తున్నారు. వాణిజ్య కార్యకలాపాలే కాదు రియల్ ఎస్టేట్ లావాదేవీలు కూడా గణనీయంగా పడిపోయాయి. అయితే, సంక్షోభం ముగిసిన తర్వాత విక్రయాలు ఊపందుకొంటాయనుకొన్న రియల్టర్ల అంచనాలు తారు మారయ్యాయి. ఆర్థిక సంక్షోభ భయాలు, కరోనా నేర్పించిన ఆరోగ్య సంరక్షణ పాఠాలతో వైద్య ఖర్చులకు బడ్జెట్‌ను పెద్దమొత్తంలో కుటుంబాలు కేటాయించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరగడంతో ఆఫీసు స్పేస్‌లకు గిరాకీ తగ్గడం వెరసి రియల్ ఎస్టేట్ రంగంపై పెను ప్రభావం పడింది. కరోనాకు ముందు బ్యాంకుల నుంచి వడ్డీకి పెద్ద మొత్తంలో రుణాలను తీసుకొచ్చిన రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ భవనాలను నిర్మించాయి.

విక్రయాల ద్వారా వచ్చిన మొత్తంతో బ్యాంకు బకాయిలను చెల్లించాలనుకొన్నాయి. కానీ, కరోనా తర్వాత కొనుగోలుదారుల నుంచి ఆశించిన మేర స్పందన రావట్లేదు. మరోవైపు బ్యాం కుల నుంచి ఒత్తిడి పెరగ




సాగింది. దీంతో చేసేదేమీ లేక నిర్మాణం ఖర్చుల కంటే తక్కువ మొత్తాలకే విక్రయాలు జరుగుతున్నాయి. మన్‌హట్టన్‌లో ఓ బ్రోకర్ ఓ భారీ భవంతిని 50 శాతం డిస్కౌంట్‌తో ఇటీవల కొనుగోలు చేశాడు. లాస్‌ఏంజెల్స్‌లో ఓ బహుళ అంతస్తుల భవనాన్ని ఓ వ్యక్తి పదేండ్ల కిందట కొనుగోలు చేశాడు. గత డిసెంబర్‌లో దాన్ని కొన్న ధర కంటే 45 శాతం తక్కువకు విక్రయించాడు. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. అమెరికాలోనే కాకుండా జర్మనీ వంటి ఐరోపా దేశాలతో పాటు భారత్‌లోనూ రియల్ ఎస్టేట్ కుదేలవుతున్న సంకేతాలు కనిపిస్తున్నట్టు నిర్మాణరంగ నిపుణులు చెబుతున్నారు.

## అంబేద్కర్ నగర్ మాదిగ సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ జన్మదిన వేడుకలు

**బోడుప్పల్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ మాదిగ సంఘం ఆధ్వర్యంలో భారత ఉప ప్రధాని, స్వతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ 117వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ నగర్ మాదిగ సంఘం అధ్యక్షులు తాడూరి శివకుమార్ కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్రివన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గరుకుల యాకయ్య పొట్ట లక్ష్మయ్య అంబేద్కర్ నగర్ అధ్యక్షులు ఊరటి మహేష్ మల్లేష్ గణేష్ గరుకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## 48 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ అమ్మేళనం



**మేడ్చల్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం):**

48 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. శనివారం మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మేడ్చల్ జిల్లా పరిషత్ హై స్కూల్ 1977 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు 48 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులకు సన్మానం చేశారు. 48 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషకరమని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అప్పటి జ్ఞాపకాలను చెప్పుకొని చాలా సంతోషం వ్యక్తం చేశారు. సాంస్కృత పాటలతో డ్యాన్సులతో అలరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 48 సంవత్సరాల మేమంతా కలుసుకోవడం చాలా సంతోషం ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు.

## రాజబొల్లారం తండాలో చలివేంద్రం ప్రారంభం



**మేడ్చల్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం):**

మేడ్చల్ మండలం రాజబొల్లారం తండాలో మాజీ ఎంపీటీసీ మాలోత్ అంకిత రవి నాయక్ అధ్వర్యంలో చలివెంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలోత్ రవి నాయక్ రవి నాయక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము శ్రీ శ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి కమాన్ వద్ద మజీద్ పూర్ నుండి మేడ్చల్ వెళ్లే వాహనదారులకు, పాదచారులకు, వెంకటేశ్వర స్వామి ఆలయానికి కి వెళ్లి ప్రతి వాహనదారులకు ఉపయోగం పడుతుందన్నారు. సుమారు పది సంవత్సరాల నుండి చలివేంద్ర ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలోత్ పాండు నాయక్, మాలోత్ రాజు నాయక్, మాలోత్ రవి నాయక్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్ఆర్ జయశంకర్ చౌరస్తా నుండి నూతన బస్సు సౌకర్యం




**మేడ్చల్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం):**

మేడ్చల్ పట్టణంలోని కెఎల్ఆర్, జయశంకర్ చౌరస్తా నుండి సికింద్రాబాద్ కు నూతన బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు తెలిపారు. ఇటీవల కెఎల్ఆర్, జయశంకర్ చౌరస్తా. రాఘవేంద్ర నగర్ కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం ఇవ్వడంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు బుధవారం నుండి ప్రతిరోజూ ఉదయం 8.40, 9.10 టైమింగ్ లో బస్సులు నడపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## యువతిని వేధిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

**ఘట్కేసర్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**



ఘట్కేసర్ ప్రాంతంలోని ఓ కాలేజీలో చదువుతున్న యువతిని నిత్యం వేధింపులకు గురిచేస్తూ... యువతి మనోవేదనకు కారణమవుతున్న వ్యక్తిని ఘట్కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగాపురం, ఘణపురం ప్రాంతంలో నివాసం ఉండే బర్ల సురేష్ వయసు 30 సంవత్సరాలు వృత్తి రీత్యా డ్రైవర్ కాగా...ఘట్కేసర్ ప్రాంతంలోని ఓ కాలేజీలో చదువుతూ హాస్టల్లో ఉంటున్న యువతి ని నిత్యం వేధిస్తూ... యువతి తన స్నేహితునితో మాట్లాడుతున్న సందర్భంలో వీడియోలు తీసి బ్లాక్మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనతో శారీరకంగా కలవాలని లేకుంటే ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు పాల్పడడంతో యువతి ఘట్కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జన్మదిన వేడుకలు

**బోడుప్పల్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

స్వతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని, నేటి యువతరానికి ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్ రామ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ నేతలు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం ఆ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 117 పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, స్వతంత్ర సమరయోధుడిగా ప్రజా ప్రతినిధిగా, రాజ్యాంగ నిర్మాణంలో సభ్యునిగా పనిచేసి అనంతరం అనేక శాఖలో మంత్రిగా పనిచేసిన బాబు జగ్జీవన్ రామ్ ఎంతో మందికి ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త చక్రపాణి గౌడ్, కే రామచందర్ రెడ్డి, బి శ్రీధర్ గౌడ్ కే నరసింహ వై శ్రీహరి గౌడ్ సురేష్ ఉప్పరి విజయ్ చినిగళ్ళ



వినయ్ చంటి శీను నర్సింగ్ నాయక్ హలీం శ్రీనివాస్ సంతోష్ నాగేష్ గౌడ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగజీవన్ రామ్‌కి భారత రత్న ఇవ్వాలి: పంగ ప్రణయ్ కుమార్ మాదిగ



**మేడిపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117జయంతి సందర్భంగా మేడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ నవ భారత నిర్మాణానికి నాంది పలికిన అగ్రశ్రేణి జాతీయ నాయకుల్లో ముఖ్యులు డాక్టర్ బాబు జగజీవన్ రామ్ అని,చిన్న తనంలోనే స్వతంత్ర ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన నాయకుడు, కులవివక్ష పై నిరంతరం పోరాటం చేసిన ధైర్యశాలి, బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగా కలల స్వప్నాన్ని నిజం చేసిన ఆరాధ్యుడని, రాజకీయ, సామాజిక చరిత్రలో ఎన్నో అధ్యయనాలు నెలకొల్పిన మహానియుడని, చరిత్ర ముందుతారాలకు అందించడమే.. ఆ మహానియుడి కి మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. జయంతి కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులూ ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మేడిపల్లి మండల అధ్యక్షులు బండారి సాయి మాదిగ, మహనీయుల ఆశయ సాధన సమితి నాయకులు పాశం సత్యం యాదవ్, కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పవన్ గౌడ్, బద్రు నాయక్, కావడపు రాంరెడ్డి, దేవీసింగ్ నాయక్ సింగం లక్ష్మణ్, కూతాడి రాజు, రాజేష్ నాయక్, శ్రీను నాయక్, మనోజ్ లేగల,క్యాసగళ్ళ కరుణాకర్, చైతన్య కుమార్, చిన్నపాప్పయ్య, శివ, చిప్ప సంపత్, కుమారస్వామి, భక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ ఆత్మీయులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

### పీర్జాదిగూడ బీజేపీ పార్టీ అధ్యక్షులు రాంపల్లి యాదగిరి గౌడ్

**మేడిపల్లి, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

ఏప్రిల్ 6వ తేదీ బీజేపీ పార్టీ ఆవిర్భవించి 45 వసంతాల సందర్భంగా బీజేపీ పార్టీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు పీర్జాదిగూడ అధ్యక్షులు రాంపల్లి యాదగిరి గౌడ్. ఈ మేరకు మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఆవిర్భావం తర్వాతనే భారతదేశ మార్పునకు నాంది పలికిందని, దేశ ప్రజల ఆదరణతో దినదిన అభివృద్ధి చెంది నేడు ప్రపంచ దేశాలు గర్వించదగ్గ పాలన బీజేపీ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలు ద్వారా ఆనందంగా ఉన్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను



అభివృద్ధిని ఆకాంక్షిస్తూ క్లిష్టమైన సమస్యలను పరిష్కరిస్తూ తిరుగులేని పార్టీగా బీజేపీ పార్టీ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఏ పార్టీలోని క్రమశిక్షణ ఒక్క కాషాయా రంగు పార్టీలో ఉంటుందని... ప్రతి ఒక్కరు సిద్ధాంతాలకు లోబడి పని చేస్తారని అన్నారు. ఈ పార్టీలో అవినీతి అక్రమాలకు తావు లేదని తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి దేశ ప్రజల సహకారం కావాలని అందుకు సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

# మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్‌కి ఘనంగా నివాళులు అర్పించిన కిన్నెర రవీందర్

**ఘట్కేసర్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

మాజీ ఉప ప్రధాని, స్వతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ 117 వ పుట్టినరోజు సందర్భంగా కాచవాని సింగారం మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చుంచు నవీన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా నాయకులు రవీందర్ పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సామాన్యుల ఆశాదీపం భారతదేశ ప్రగతిలో కీలకంగా పనిచేసిన బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్న ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి కిన్నెర రత్నాకర్, మండల మైనార్టీ అధ్యక్షులు ఎండి ముస్తఫా, చుంచు నాగరాజు, గ్యార వెంకటేశ, సాయికుమార్, సాయి తేజ, బండిరాల మధు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

## ఘట్కేసర్ బీజేపీ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రభంజన్ గౌడ్

**ఘట్కేసర్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

బీజేపీ పార్టీ ఆవిర్భవించి 45 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి ఒక్క బీజేపీ రథసారధులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు ఘట్కేసర్ బీజేపీ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కోటగిరి ప్రభంజన్ గౌడ్. ఈ మేరకు మాట్లాడుతూ



నికార్సైన బీజేపీ పార్టీ రథసారథిలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నాను అని.. పార్టీ అభివృద్ధి కొరకు తనలాగా లక్షలాదిమంది బీజేపీ సేనాధులు పనిచేస్తున్నారని వారి కారణంగానే నేడు ప్రపంచంలోనే అత్యున్నతమైన పార్టీగా బీజేపీ పార్టీ ఉందని అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అగ్ర నేతలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

## అదిలాబాద్ లో పౌర విమానయాన సేవలు - గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రక్షణ మంత్రి

విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ వాసుల కలలు త్వరలోనే ఫలించబోతున్నాయి. ఆదిలాబాద్?లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ మేరకు రాజ్‌నాథ్ సింగ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. కీలకమైన ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతోపాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు స్పష్టం లేఖలో చేశారు.స్థానిక ప్రజలు, నాయకుల నుంచి కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ కి 29 జనవరి, 2025 నాడు కిషన్‌రెడ్డి లేఖ రాశారు. వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు సద్వినియోగం చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై రక్షణ శాఖ అధికారులతో చర్చించిన తర్వాత సానుకూల నిర్ణయాన్ని తెలియజేస్తూ కిషన్‌రెడ్డికి లేఖరాశారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను కిషన్‌రెడ్డి హృదయపూర్వకంగా స్వాగతించారు. ఇందుకుగానూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ,



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## మాజీ మంత్రి సర్వే సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంచల నర్సింగరావు

**బోడుప్పల్, ఏప్రిల్ 5 (తెలంగాణ చేతనం)**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంచల నరసింగ్ రావు. ఈ మేరకు మాజీ మంత్రిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం మాట్లాడుతూ దిగ్గజనేత సర్వే సత్యనారాయణ ను కలవడం సంతోషంగా ఉందని, ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజా నేతగా పేరు పొందారని, ముఖ్యంగా సామాన్యులకు ఆశాజ్యోతి సర్వే నారాయణ అని అన్నారు. ఆయన మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని ప్రజాక్షేత్రంలో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

## వారికి నాయకత్వ లక్షణాలు నేర్పించాలి: శ్రీధర్ బాబు



విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలను నేర్పించాలని, అప్పుడే సమాజాన్ని అర్థం చేసుకునే మంచి నాయకులు తయారవుతారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం సన్ సిటీలోని "గ్లెన్డేల్ అకాడమీ"లో నిర్వహించిన "లీడర్ షిప్ డే - 2025" కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిత్వ నిర్మాణంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కేవలం మార్కులు మాత్రమే జీవితం కాదని, తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ చూపేలా చిన్నారులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. ప్రతి చిన్నారిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని ఇతరులతో పోల్చి వారిపై ఒత్తిడి తేవొద్దని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థి దశలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు కొత్త అంశాలను నేర్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. టెక్నాలజీ రోజురోజుకీ కొత్త పుంతలు తరుణంలో వినూత్నంగా ఆలోచించాలన్నారు. అన్ని రంగాల్లో మెరుగ్గా రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ జీ డిప్యూటీ కంట్రీ డైరెక్టర్ అవ్నీష్ సింగ్, గ్లెన్డేల్ గ్రూప్స్ డైరెక్టర్ మీనూ సలూజా, లైఫ్ కోచ్ అండ్ మెంటార్ డా.కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ నాటికి పాలమూరు- రంగారెడ్డి లిఫ్ట్ ఫస్ట్‌ఫేస్

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం సచివాలయంలో నీటిపారుదల శాఖ సీనియర్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మొదటి దశ పనులు ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టనున్నారు. డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే, వివిధ రిజర్వాయర్ల పనులు వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

కరివెన రిజర్వాయర్ వరకు పనులు వేగవంతం చేయడంతోపాటు నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్‌ల మధ్య ప్యాకేజీ కాలువ పనులు వెంటనే ప్రారంభించి 2025 అక్టోబర్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసేలా నిర్ణయం తీసుకున్నారు. రిజర్వాయర్ సామర్థ్యాలు ఇంపౌండింగ్ లక్ష్యాలలో నార్లాపూర్(6.40 టీఎంసీ), ఏదుల (6.55 టీఎంసీ), వట్టెం (16.70 టీఎంసీ), కరివెన(19.00 టీఎంసీ) వద్ద అన్ని రిజర్వాయర్ పనులు సకాలంలో పూర్తి చేయనున్నారు. తద్వారా డిసెంబర్ 2025 నాటికి సుమారు 50 టీఎంసీ నీటిని నిలుపుదల చేయాలని నిర్ణయించారు. ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్ కింద నార్లాపూర్, ఏదుల, వట్టెం పంపింగ్ స్టేషన్లలో 400 కెవి సబ్‌స్టేషన్‌లను పూర్తి చేసేందుకు టిజిట్రాన్స్‌కోకు ఏఎన్?ఆర్?262 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. జూలై 2025 నాటికి పంపుల డ్రై రన్ నిర్వహించబడుతుందన్నారు. రిజర్వాయర్ కెపాసిటీ పునరుద్ధరించనున్నారు. తద్వారా 12 టీఎంసీల అసలు నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డీ-సెడిమెంటేషన్ పనులను చేపట్టాలని నిర్ణయించారు. సమీక్షలో తీసుకున్న నిర్ణయాలతో ప్రధానంగా తెలంగాణ వ్యాప్తంగా సాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతానికి, వ్యవసాయం తాగునీటి అవసరాల కోసం స్థిరమైన నీటి వనరులను నిర్ధారించడంలో ప్రభుత్వ నిబద్ధతలో గణనీయమైన పురోగతిని సాధిస్తోందన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గిరిజన పాఠశాలలో కొరవడిన భద్రత

తనకల్లు :మారుమూల పల్లెల్లోని గిరిజన బాలికలు ఆర్థిక సమస్య కారణంగా చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన పాఠశాలలో వసతి కల్పిస్తూ వారి భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థినుల కోసం తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఐదు నుంచి పదో తరగతి వరకు 400 పైగా విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. కాగా.. పాఠశాలలో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలతో విద్యార్థినులకు రక్షణ కరవైందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల కొక్కంటిక్రాస్ నుంచి మహమ్మదా బాద్‌క్రాస్‌కు వెళ్లే రహదారి పక్కనే ఉన్నా.. గ్రామాలు దూరంగా ఉండటంతో రాత్రి సమయంలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రిన్సిపల్ దిద్దుబాటు చర్యలు తీసుకోని కారణంగా అవి పునరావృతం అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల వెనుకవైపు ఉన్న ప్రహరీ ఎత్తు లేని కారణంగా ఆ వైపు నుంచి దుండగులు పాఠశాలోకి ప్రవేశిస్తున్నారనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. దాదాపు 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి మొత్తం పాఠశాల ముందు వైపు, గదుల్లో ఉండటం, వెనుక భాగాన లేని కారణంగా నిందితుల గుర్తింపునకు ఇబ్బంది కలుగుతోంది. ప్రహరీ



ఎత్తు పెంచి ముళ్ల కంచె ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుందని విద్యార్థినుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 23న అర్ధరాత్రి పాఠశాల మైదానంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి వసతి గది కిటికీని రాయితో పగులకొట్టాడు. చెప్పులు అక్కడే వదిలి ఉండటాన్ని పాఠశాల సిబ్బంది గుర్తించారు. తెల్లవారుజామున ఓ విద్యార్థిని స్నానపు గదిలో ఉండగా ఓ వ్యక్తి చూడటాన్ని గుర్తించిన బాలిక కేకలు వేయడంతో దుండగుడు పరారైనట్లు తెలిసింది. విద్యార్థినులు భయాం దోళన చెందుతున్నారు. పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ జరపగా నిందితుల ఆచూకీ లభ్యం కాలేదు.

# విద్యార్హత లేకున్నా అడ్డగోలు నియామకాలు



జేఎన్‌టీయూ:వైకాపా పాలనలో అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. తాజాగా జేఎన్‌టీయూ అనుబంధ సంస్థలో ఇద్దరు సహాయాచార్యుల నియామకం విషయంలో అక్రమాలు జరిగినట్లు స.హ. చట్టం ద్వారా తెలిసివచ్చింది. ఈ ఇద్దరి నియామకాలే కాకుండా వర్సిటీ పరిధిలో మరిన్ని అక్రమాలు జరిగినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థలో ఇద్దరు సహాయాచార్యుల నియామకంపై వివాదం నెలకొంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నియామకాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. విద్యార్హత లేకున్నా నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ (ఓటీపీఆర్ఐ)లో ఫార్మసీ, ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో ఉద్యోగుల కొరత ఉండటంతో గత ప్రభుత్వ హయాంలో నలుగురిని అడ్‌హక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించారు. ఆ నలుగురిలో ఇద్దరికి విద్యార్హత లేకపోయినా నియమించినట్లు తెలిసింది. ఓ న్యాయవాది స.హ.చట్టం ద్వారా అడహక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల విద్యార్హతల సమాచారం కోరారు. ఓటీపీఆర్ఐ అధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన సమాచారం మేరకు ఇద్దరు సహాయాచార్యులకు విద్యార్హత లేనట్లు గుర్తించారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఎమ్మెస్సీ ఫుడ్‌టెక్నాలజీ కోర్సులు బోధించడానికి అదే విభాగంలో ఎమ్మెస్సీతో పాటు పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. కానీ ఇద్దరు సహాయాచార్యులు ఇతర సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ చేశారు. ఆ ఇద్దరిలో ఒకరు మైక్రోబయాలజీలో ఎమ్మెస్సీ, బయో టెక్నాలజీలో పీహెచ్‌డీ చేశారు. మరొకరు ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ, కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ విద్యార్హత ఉన్నవారు ఫుడ్‌టెక్నాలజీ కోర్సుల బోధనకు అనర్హులని పలువురు జేఎన్‌టీయూ ఆచార్యులు పేర్కొంటున్నారు. వైకాపాకు చెందిన ఓ సలహాదారుడు, అదే పార్టీకి చెందిన మరో ప్రజా ప్రతినిధి సిఫార్సులతో ఈ నియామకాలు జరిగినట్లు చర్చ జరుగుతోంది. మూడు సంవత్సరాల క్రితం ఈ నియామకాలు చేపట్టి ఒక్కొక్కరికి నెలకు రూ.40 వేలు వేతనం చెల్లిస్తున్నారు.

# ఉచిత తర్ఫీదుతో యువతకు భరోసా

కళ్యాణదుర్గం: గత వైకాపా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసింది. ఐదేళ్లలో కనీసం ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా అరకొర పోస్టులతో ప్రకటన విడుదల చేసింది. మెగా డీఎస్సీ అంటూ కేవలం ఆరు వేల పోస్టులతో సరిపెట్టింది. దీంతో నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎట్టకేలకు సీఎం అయ్యాక ఇచ్చిన హామీ మేరకు సదరు ఫైలుపైనే తొలి సంతకం చేశారు. ఈమేరకు 16 వేలకు పైగా పోస్టులతో ప్రకటన విడుదల చేశారు. ఈనేపథ్యంలో నిరుద్యోగులు ఉపాధ్యాయ కొలువు సాధించడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేటు సంస్థల్లో శిక్షణ తీసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి డీఎస్సీ అభ్యర్థులు సొంతంగానే చదువుకోవాల్సి వస్తోంది. దీన్ని గుర్తించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఉచితంగా తర్ఫీదు ఇప్పించడానికి నడుం బిగించారు. పరీక్ష జరిగే వరకు కళ్యాణదుర్గంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి ఉత్తమ శిక్షకులతో తర్ఫీదు అందించాలని నిర్ణయించారు. ఈమేరకు హైదరాబాద్, అవనిగడ్డ, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి 18 మంది శిక్షకులను రప్పించారుఉపాధ్యాయ ఉద్యోగం పొందాలని ఎంతో ఉత్సాహంగా ఉన్నా. 2015లో బీఈడీ



పూర్తి చేశా. వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నా. రోజూ ఐదారు గంటలు చదువుతున్నా. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే నిరుద్యోగుల కోసం శిక్షణ ఇప్పించడం అభినందనీయం.

019లో బీఈడీ పూర్తి చేసి సర్వశిక్షా అభియాన్‌లో భాగంగా గ్రామంలోనే చిన్నారులకు బోధన చేస్తున్నా. కుటుంబలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలిగింది. మాలాంటి వారికి ఎంతో ఊరట కలుగుతోంది.

# కుప్పంలో వినతుల వెల్లువ

కుప్పం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్యూహ్య స్పందన వచ్చింది. వినతులు అందించేందుకు ప్రజలు ఉదయం నుంచే బారులుదీరారు. మొత్తం 600కిపైగా అర్జీలు రాగా.. అందులో 436 రెవెన్యూ సమస్యలపై వచ్చినట్లు అధికారులు తెలిపారు. తమ సమస్యలను ముందుగా నమోదు చేసుకునేందుకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారుల వద్ద గంటల తరబడి నిలబడాల్సివచ్చింది. సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జేసీ శ్రీనివాసులు ఇతర జిల్లా అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. వినతులను ఆయా శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిష్కరించి పురోగతి తెలియజేయాలన్నారు. మాది శాంతిపురం మండలం గొల్లపల్లె గ్రామం. నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై నడుము, కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నా. రెక్కాడితేనే గానీ డొక్కాడని పరిస్థితి. గత ప్రభుత్వంలో వంద శాతం అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. దీంతో పింఛన్ మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. పేద



బతుకులు కావడంతో పనికి పోలేక పస్తులుండాల్సి దుస్థితి. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. వైకాపా ప్రభుత్వం తెచ్చిన రీ సర్వే చాలా మంది రైతులకు నష్టం చేసింది. నా పేరిట కుప్పం మండలం సజ్జలపల్లె రెవెన్యూ దాఖలాలో సర్వే సంఖ్య 33/1ఎ, 33/5లో 1.84 ఎకరాల భూమి ఉంది. ఇది కొనుగోలు చేసినది. అందుకు సంబంధించిన పాసు పుస్తకం సైతం ఉంది. అయితే గతేడాది చేపట్టిన రీ సర్వే తర్వాత 1.37 ఎకరాలే ఉన్నట్లు రికార్డుల్లో చూపుతోంది. 0.47 సెంట్ల భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో మాయమైంది. ఏమైందో ఏమోనని అధికారుల చుట్టూ తిరుగుతున్నా, ప్రయోజనం లేక పోయింది.

# ప్రజలకు రక్షిత నీటిని సరఫరా చేయాలి: సిపిఎం

అనంతపురం కార్పొరేషన్ :అనంతపురం నగరంలోని ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని అనంతపురం సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం నగరకమిటీ నాయకులు నగర పాలక సంస్థ మేయర్ వసీంను కలిసి వినతీ పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటిని శుద్ధి చేయకపోవడంతో ప్రజలు అనేక రోగాల భారీన పడుతున్నారన్నారు. నగరంలో సరఫరా అవుతున్న మంచినీరు పైప్ లైన్ లీకులతో మురుగుకాల్వల్లోని నీరు కలిసి తాగునీరు కలుషితమవుతుందన్నారు. దీనిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. కనీసం మున్సిపల్ అధికారులు ప్రజలు డయేరియా నుండి కాపాడుకోవడం కోసం అవగాహన కూడా కల్పించడం లేదని తెలిపారు.ఇప్పటికైనా అధికారులు కలుషిత నీరు తాగడం వల్ల వచ్చే అనారోగ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాని కోరారు..ఈ సందర్భంగా నగర మేయర్ వసీం , డిప్యూటీ



మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి స్పందిస్తూ తక్షణమే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర నాయకులు వెంకటనారాయణ, బాలకృష్ణ, మసూద్, వెంకటేష్ ,నూరుల్లా, ఆటో యూనియన్ శివ ,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# తితిదే కళాశాలలో ప్రవేశాలకు అష్టకష్టాలు!?

తిరుపతి: తితిదే కళాశాలల్లో ప్రవేశాలు కష్టతరంగా మారాయి. వీటిలో నామమాత్రం రుసుముతో నాణ్యమైన విద్యనందించడంతోపాటు వసతి, భోజనం కల్పిస్తుండటంతో ప్రవేశాలకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. పది పూర్తవగానే అధికశాతం శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలను ఎంచుకుంటున్నారు. పదేళ్లుగా కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థినులతో సమానంగా, వారికంటే ఎక్కువగా మార్కులు సాధిస్తున్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకులు పొందుతున్నారు. కళాశాలలో సీట్ల సంఖ్యను పెంచాలని వైకాపా ప్రభుత్వంలోని తితిదే అధికారులకు కళాశాల అధికారులు, విద్యార్థినుల తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాలు విన్నవించినా ఎలాంటి ఫలితం లభించలేదు. నూతన ఈవోగా నియమితులైన శ్యామలరావుకు విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు, పలువురు రాజకీయ నాయకులు ఇదే విషయమై విన్నవించారు. చిత్తూరు, తిరుపతి, రాయలసీమ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల విద్యార్థులు ప్రవేశాలపై ఆసక్తి చూపుతున్నారు. మంగళవారంతో స్పాట్ ప్రవేశాలు ముగియగా పరిమిత సీట్లు ఉండటంతో మంచి మార్కులు సాధించినప్పటికీ సీటు లభించక ఎంతోమంది విద్యార్థినులు నిరాశతో వెనుదిరిగారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, సీఈఎల్ కోర్సులను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో రెండు సెక్షన్లుగా నిర్వహిస్తున్నారు. మొత్తం ప్రథమ సంవత్సరంలో 968 సీట్లు ఉండగా ఈ సంఖ్య ఎనిమిదేళ్లుగా పెంచకపోవడంపై ఆవేదన వ్యక్తమవుతోంది.కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో మొత్తం 1936 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో ప్రథమ సంత్సరం నుంచి 450, ద్వితీయ సంవత్సరం నుంచి 450 మంది విద్యార్థినులు కలిపి మొత్తం 900 మంది



విద్యార్థినులకు మాత్రమే వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. మిగిలిన వారు బయట ప్రైవేటు వసతి గృహాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో భద్రత కొరవడి విద్యార్థినుల తల్లిదండ్రులు

ఆందోళన చెందుతున్నారు. కనీసం రెండువేలమందికి వసతి కల్పిస్తే బాగుంటుందని కోరుతున్నారు. విద్యాకేంద్రంగా భాసిల్లుతున్న తిరుపతిలో తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలలు తప్పితే ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. ఈ కళాశాలల్లో పరిమిత సీట్లు ఉండటంతో అప్పులు చేసి ప్రైవేటు కళాశాలల్లో చేర్చుతున్నారు. పద్మావతి జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపుకు రూ.4900, ఆర్ట్స్ గ్రూపుకు రూ.3970, హాస్టల్‌కు రూ.3025 చెల్లిస్తే చాలు. ప్రైవేటు కళాశాలల ఫీజులతో పోల్చితే ఈ ఫీజు చాలా తక్కువగా ఉండటంతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తితిదే కళాశాలలో సీటువస్తే బాగుంటుందని ఆశ పడుతున్నారు. ఉన్నతాధికారులు అధికారులు స్పందించి సీట్ల సంఖ్యను పెంచితే బాగుంటుందని కోరుతున్నారు.

### అలిపిరి కాలినడకన

# ఓవర్‌పాస్ నిర్మాణం జరిగేనా?



భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ నిర్మించాలనుకున్న ఓవర్ పాస్(పైవంతెన) నిర్మాణానికి ఏపీలో కొలువుదీరిన ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. చిరుతపులుల దాడుల్లో చిన్నారి మృత్యువాత పడిన ఘటన గతంలో సంచలనం రేపింది. 2023 జూన్ 22న అలిపిరి కాలినడక దారిలో ఏడో మైలు వద్ద చిరుతపుల్లి కౌశిక్ అనే బాలుడిపై దాడి చేసి గాయపరిచింది. బాలుడు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలకే అగస్టు 11వ తేదీన నడిచి వెళుతున్న లక్షిత అనే బాలికపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో చిరుత దాడి చేసి.. సమీప అటవీప్రాంతంలోకి లాక్కెళ్లి చంపేసింది. దాంతో అప్పటి టీటీడీ అధికారులు సాయంత్రం ఐదు గంటల తర్వాత కాలినడక దారిని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అ?ధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఏర్పాటు చేసిన బోన్లలో ఆరు చిరుత పులులు పట్టుబడ్డాయి. అయితే కాలినడక దారిలో భక్తులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని చెబుతూ మైకులను టీటీడీ ఏర్పాటు చేసింది. అలాగే రక్షణ కోసం భక్తులకు వెదురు కర్రలు కూడా అందజేసింది.ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఓవర్‌పాస్ (పైవంతెన) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. చిన్నారులపై చిరుత పులులు దాడి చేసిన సంఘటనా స్థలాన్ని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించింది. ఓవర్‌పాసతోపాటు జంతువులు తిరిగేందుకు వీలుగా అండర్‌పాస్.. అలాగే కాలినడక మార్గానికి రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిపుణుల బృందం సూచించింది. దీనికి దాదాపు రూ.50కోట్లు ఖర్చు అవుతుందని అంచనా కూడా వేసింది. ఈ వంతెన వల్ల జంతువుల నుంచి కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. అలాగే వన్యప్రాణులకు కూడా భక్తుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంది. దాదాపు ఎనిమిది నెలల క్రితమే ప్రతిపాదనలు టీటీడీకి వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అందజేసింది. కానీ టీటీడీ ఇప్పటి వరకు స్పందించిన దాఖలాలు లేవు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికైనా ఈ ప్రతిపాదనలపై టీటీడీ తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# టీడీపీ ఖాతాలోకి కార్పొరేషన్

చిత్తూరు:చిత్తూరు నగరపాలక సంస్థ కూటమి ఖాతాలో చేరింది. శుక్రవారం నాటి చేరికలతో కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వీరిలో మేయరు అముద, డిప్యూటీ మేయరు రాజేషకుమార్‌రెడ్డి కూడా ఉన్నారు. వైసీపీలో వర్గవిభేదాలు, అసంతృప్తులతో పాటు అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న భావనతో పలువురు పార్టీ మారారు. నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో 50 డివిజన్లు ఉండగా.. అప్పట్లో 37 చోట్ల వైసీపీ దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకుంది. మిగిలిన వాటికి ఎన్నికలు జరగ్గా.. 3 చోట్ల టీడీపీ గెలిచింది. తాజాగా మేయర్, డిప్యూటీ మేయర్ సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో వీరి బలం 21కి పెరిగింది. కొన్నాళ్ల కిందట నలుగురు జనసేనలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమికి 25 మంది సభ్యులయ్యారు. వీరికి తోడు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా చేరడంతో ఆ సంఖ్య 27కి చేరింది. ఇంకా కొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా, చేరికల సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, నగర అభివృద్ధి కోసం మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారుమాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వసంత్ కుమార్, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, అశోక్, కంద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అందరి సహకారంతో




చిత్తూరును అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని మేయరు అముద తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వేలూరు, తిరుపతికి దీటుగా చిత్తూరును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని డిప్యూటీ మేయర్ రాజేషకుమార్ రెడ్డి తెలిపారు. దీనికోసం ఎమ్మెల్యే వద్ద మాస్టర్ ప్లాన్ ఉందన్నారు. మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష కుమార్ రెడ్డి, డివిజన్ల వారీగా కార్పొరేటర్లు.. పి.నవీన్ కుమార్ (2వ) బి.అజర్ భాను (6వ), డి.కె.సుమతి (10వ ), ఎం.శాంతి (18వ), పి.గంగ (22వ), ఇ.ఇందు (27వ ), టి.ప్రభావతి (28వ), ఎస్.సుష్మ (30వ), సయ్యద్ సర్దార్ (31వ), ఎస్.ఉన్నికృష్ణ (38వ), పి.గణేష్, (40వ), కుప్పమ్మ (41వ), ఆర్.శశికుమార్ (42వ), పి.వెంకటరమణ (43వ), ఎస్.రెడ్డెప్ప (46వ), ఏజీ సహదేవన్ (50వ డివిజన్).

# టూరిజం హబ్‌గా తిరుపతి

చంద్రగిరి : తిరుపతిని టెంపుల్...ఎకో...హెల్త్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్..రోపవే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు.జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలుతిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడే పర్యాటక శాఖ అధ్వర్యంలో దేవరాగం పేరిట ఏర్పాటు చేసిన హెూటల్‌ను ప్రారంభించారు.అనంతరం తిరుపతి చేరుకుని జూపార్కు సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన 30 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.ఏపీ టూరిజం కార్యాలయం, భవనాలు, స్థలం, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తనిఖీ చేశారు. పర్యాటకాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షిం చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో సినీ స్టూడియో నిర్మాణంపై నిర్మాతలతో మాట్లాడతామన్నారు. పర్యాటక అభివృద్ధికి చాలా అవకాశాలున్నా గత ప్రభుత్వం ఒక్క కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్..రోపవే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు.జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలు ఓబరాయ్ హెూటల్‌కు, 10 ఎకరాలు దేవ్‌లోక్ సంస్థకు గతంలో ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.రుయాస్పత్రి ఎదురుగా అసంపూర్తిగా వున్న టూరిజం బిల్డింగ్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన లైట్ అండ్ మ్యూజిక్ షోను త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టూరిజం ఎండీ కన్నబాబు,రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీవీఎం గిరిధర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



# తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి రేసులో ఆ నలుగురు

**చెన్నై:** తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి రేసులో తాను లేనంటూ ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న కె.అన్నామలై కీలక వ్యాఖ్యలు చేయడంతో ఆయన స్థానంలో ఎవరికి పార్టీ అధ్యక్షుడి పగ్గాలు అప్పగించనున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈనెల 8-10 తేదీల మధ్య కొత్త నేతను పార్టీ అధిష్టానం ఎన్నుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. సామాజిక వర్గం, పార్టీ పట్ల విధేయత వంటివి సహజంగానే పరిగణనలోకి తీసుకుంటారు. ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో నాలుగు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిలో తమిళిసై సౌందరరాజన్, నైనార్ నాగేంద్రన్, ఎల్.మురుగన్, వనతి శ్రీనివాసన్ ఉన్నారు.



**1.తమిళిసై సౌందరరాజన్**

తమిళనాడు బీజేపీ సీనియర్ నేతగా, పార్టీ విధేయురాలిగా తమిళిసై సౌందర్‌రాజన్‌కు పేరుంది. గతంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా, ఇటీవల వరకూ తమిళనాడు గవర్నర్‌గా ఆమె పనిచేశారు. 2024లో తిరిగి ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. సౌత్ చెన్నై లోక్‌సభ సీటు నుంచి పోటీ చేసి డీఎంకే అభ్యర్థి తమిళాచి తంగపాండియన్ చేతిలో ఓడిపోయారు. రాజకీయాల్లో అనుభవం ఉన్నప్పటికీ గతంలో ఆమె రాష్ట్ర బీజేపీ అధక్షురాలిగా ఉన్నప్పుడు పార్టీకి పెద్దగా లాభించినది లేదనే చెప్పాలి. అయితే విధేయత, అందరికి తెలిసిన వ్యక్తినే పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎంపిక చేయదలచుకుంటే ఆమె ఈ పదవికి గట్టి పోటీదారుగానే చెప్పాలి.

**2.నైనార్ నాగేంద్రన్**

సీజన్డ్ పొలిటీషన్‌గా ఈయనకు పేరుంది. అటు అన్నాడీఎంకేతోనూ, ఇటు బీజేపీతోనూ ఆయనకు సాన్నిహిత్యం ఉంది. అడ్మినిస్ట్రేషన్ అనుభవం ఉంది. అన్నాడీఎంకే ప్రభుత్వంలో (2001-2006) మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2017లో ఆయన బీజేపీలో చేరారు. విద్యుత్, పరిశ్రమలు, రవాణా వంటి కీలక పదవుల్లో పనిచేశారు. తిరునల్వేలి నుంచి పలుమార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. గెలిచిన సందర్భాలతో పాటు ఓడిన సందర్భాలు కూడా ఉన్నాయి. మార్వార్ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు దక్షిణ తమిళనాడుతోనూ, మర్వార్ వర్గీయుల్లోనూ పలుకుబడి ఉంది. ఈ క్రమంలో ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకునే అవకాశం ఉండొచ్చు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోవడం ఆయనకు ప్రతికూలం కావచ్చు.

**3.ఎల్.మురుగన్**

రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడుగా ఉన్న ఎల్.మురుగన్ ప్రస్తుతం కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు అప్పగిస్తే దళిత ఓటర్లను పార్టీ వైపు ఆకర్షించే అవకాశం మెండుగా ఉంటుంది. న్యాయవాది కావడం, ఆర్ఎస్ఎస్‌తో ఉన్న అనుబంధం ఆయనకు కలిసొచ్చే అంశాలు. బీజేపీ చీఫ్‌గా ఆయన 2020 నుంచి 2021 వరకూ పనిచేశారు. పార్టీని విస్తరించే ప్రయత్నాలు గట్టిగానే చేశారు. అయినప్పటికీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ధరపురం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో నీలగిరి నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూశారు. అయితే హిందుత్వవాదిగా, దళిత ప్రతినిధిగా చూసినప్పుడు ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు అప్పగించే అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి.

**4.వనతి శ్రీనివాసన్**

ప్రస్తుతం కోయంబత్తూరు సౌత్ ఎమ్మెల్యేగా వనతి శ్రీనివాసన్ ఉన్నారు. తమిళనాడు బీజేపీ మహిళా నేతల్లో ప్రముఖులుగా ఆమెకు పేరుంది. పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా పార్టీకి సేవలందించారు. 2021లో ప్రముఖ నటుడు కమల్‌హాసన్‌పై గెలవడం ఆమెకు రాజకీయంగానూ మంచి గుర్తింపు తెచ్చింది. ఓబీసీ కావడం, సంస్థాగత అనుభవం కలిసొచ్చే అంశాలు.

# ఈ రూల్స్ తెలుసా.. వీరు టోల్ ఫీజు కట్టనక్కర్లేదు

భారతదేశంలో ప్రతి రాష్ట్రంలోనూ అనేక టోల్ ప్లాజాలు ఉన్నాయి. ప్రస్తుత లెక్కల ప్రచారం దేశ వ్యాప్తంగా సుమారు 1063 టోల్ ప్లాజాలు ఉన్నాయి. వీటి సంఖ్య కూడా నానాటికి పెరుగుతోంది. గత 5 సంవత్సరాల్లో 400 లకు పైగా కొత్త టోల్ ప్లాజాలు ఏర్పాటయ్యాయి. త్రీ వీలర్ నుంచి భారీ వాహనాల వరకు రోడ్డుపై నడపాలంటే టోల్‌గేట్ వద్ద ట్యాక్స్ కట్టాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరూ టోల్ చెల్లిస్తేనే టోల్ గేట్ దాటేందుకు అనుమతిస్తారు. అయితే, గతంలో మాన్యువల్‌గా టోల్ ఛార్జీలు చెల్లించేవారు. కానీ, ఇప్పుడు అంతా ఆన్‌లైన్ సిస్టమ్ అయ్యింది. ఫాస్టాగ్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఫాస్టాగ్ సహాయంతో క్షణాల్లో చెల్లింపులు జరిగిపోతున్నాయి. అయితే, ఫాస్టాగ్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం.. కొన్ని నిబంధనలు కూడా పెట్టింది. అందులో 10 సెకన్ల నియమం చాలా కీలకమైంది. ఈ నియమం ద్వారా ఎలాంటి టోల్ ఫీజు చెల్లించకుండానే టోల్ గేట్ దాటే అవకాశం ఉంటుంది. మరి ఈ నియమం గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. ప్రతిరోజూ లక్షలాది వాహనాలు టోల్ ప్లాజాల గుండా వెళుతుంటాయి. వీటి కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అనేక నియమనిబంధనలు రూపొందించి. ఈ నియమాల్లో ఒకటి 10 సెకన్ల రూల్. దీని ప్రకారం.. టోల్ ప్లాజా వద్ద ఒక వాహనం నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు నిలిచి ఉన్నట్లయితే.. అలాంటి వాహనానికి టోల్ ఛార్జ్ వర్తించదు. వారు టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు. రద్దీ సమయాల్లోనూ ఈ నియమం వర్తిస్తుందని ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. ఈ రూల్‌ని ఎన్‌హెచ్ఏఐ 2021లో తీసుకువచ్చింది.




**వీరు కూడా టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు..**

టోల్ ట్యాక్స్ పేమెంట్ విషయంలో మరో రూల్ కూడా ఉంది. అది కూడా సామాన్యులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం.. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల దూరంలోని వాహనాలకు ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. స్థానిక ప్రజలు తమ వాహనాలపై నిరంతరం వెళ్లాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనను రూపొందించారు. అయితే, కమర్షియల్ వాహనాలకు మాత్రం ఈ అవకాశం లేదు. స్థానికులై ఉండి.. టోల్ ట్యాక్స్ మినహాయింపు కావాలంటే.. లోకల్ రెసిడెంట్ పాస్ గానీ, నెలవారీ పాస్ గానీ తీసుకోవాలి. అలాగే లోకల్ ప్రూఫ్ ఉండాలి. లేదంటే రెట్టింపు ఫైన్ కట్టాల్సి వస్తుంది.

# వక్ఫ్ బిల్లు ఆమోదంపై
# భారీ ఎత్తున నిరసనలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ లో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం ముద్ర పడిన కొన్ని గంటల వ్యవధిలోనే పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. పార్లమెంట్ లో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్, తమిళనాడులో నిరసన గళం వినిపిస్తూ నిరసనకు దిగాయి ముస్లిం సంఘాలు. .'వక్ఫ్ సవరణ బిల్లును మేము వ్యతిరేకిస్తున్నాం' అంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్ కతా, తమినాడులోని చెన్నై, గుజరాత్ లోని అహ్మదాబాద్ లో భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళలన్నీ జాయింట్ ఫారమ్ ఆఫ్ వక్ఫ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలోని జరిగినట్లు జాతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ తెలిపింది.



**అహ్మదాబాద్‌లో తీవ్రరూపం**

వక్ఫ్ బిల్లుపై నిరసన కార్యక్రమం అహ్మదాబాద్ లో తీవ్రరూపం దాల్చింది. రోడ్లపై కూర్చొని పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అయితే పోలీసులు వారిని బలవంతంగా తొలగించే ప్రయత్నం చేసే క్రమంలో అక్కడ మరింత ఉద్రిక్తత నెలకొంది.

**తమినాడు వ్యాప్తంగా విజయ్ తమిళగ వెట్రి కజగం నిరసన**

చెన్నైలో కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించాయి, అక్కడ ఇటీవలే పార్టీ స్థాపించిన నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కజగం' రాష్ట్రవ్యాప్త నిరసనను ప్రకటించింది. చెన్నై, కోయంబత్తూర్, తిరుచిరాపల్లి వంటి ప్రధాన నగరాల్లో టీవీకే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. చేతిలో ప్లకార్డులతో తమ నిరసన తెలిపారు. ముస్లింల హక్కులను హరించవద్దు అంటూ నిరసన వ్యక్తమైంది. కాగా, రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు%-%2025పై పార్లమెంటు ఆమోద ముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది. దాదాపుగా ప్రతి సవరణపైనా ఓటింగ్‌కు విపక్షాలు పట్టుబట్టాయి. వాటి సవరణలన్నీ వీగిపోయాయి. చివరికి బిల్లు ఆమోదం పొందింది. దానికి అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. వక్ఫ్ బిల్లును కేంద్రం ఇక రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అది చట్టంగా రూపుదాల్చుతుంది. వక్ఫ్ బిల్లును లోక్‌సభ 288%-%232 ఓట్లతో ఆమోదించడం తెలిసిందే

## బాలీవుడ్ హీరో మనోజ్ కుమార్ మృతి

**ముంబై :** బాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. సీనియర్ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ ఈ ఉదయం కన్నుమూశారు. 87 ఏళ్ల మనోజ్ కుమార్ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ మరణంపై బాలీవుడ్ తీవ్ర విచారం వ్యక్తంచేస్తోంది. ప్రముఖ నటుడి మరణం అభిమానులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.మనోజ్ కుమార్ చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. మనోజ్ కుమార్ తన దేశభక్తి చిత్రాలకు ప్రసిద్ధి చెందారు. ఆయన బాలీవుడ్‌లో 'భరత్ కుమార్'గా పిలుస్తారు.మనోజ్ కుమార్ మరణంపై చిత్రనిర్మాత అశోక్ పండిట్ మాట్లాడుతూ, "... దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, మా ప్రేరణ, భారత చలనచిత్ర పరిశ్రమకు 'సింహం' మనోజ్ కుమార్ మనతో లేరు. ఇది పరిశ్రమకు భారీ నష్టం " అని అన్నారు. జూలై 24, 1937న హరికృష్ణ గిరి గోస్వామిగా జన్మించిన మనోజ్ కుమార్ హిందీ చిత్రసీమలోకి ప్రవేశించి చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. అతను "షహీద్" (1965), "ఉప్కార్" (1967), "పురబ్ ఔర్ పశ్చిమ్" (1970), "రోటీ కప్డా ఔర్ మకాన్" (1974) వంటి దేశభక్తి ఇతివృత్తాలతో కూడిన చిత్రాల్లో నటించడమే కాకుండా దర్శకత్వం కూడా చేశారు. ఈ సినిమాల కారణంగా ఆయనను 'భరత్ కుమార్' అని కూడా పిలిచేవారు.దేశభక్తి చిత్రాలే కాకుండా, "హరియాలీ ఔర్ రాస్తా", "వో కౌన్ థీ", "హిమాలయ్ కి గాడ్ మే", "దో బదన్", "పత్తర్ కే సనమ్", "నీల్ కమల్" "క్రాంతి" వంటి ఇతర ముఖ్యమైన చిత్రాల్లో నటించాడు, దర్శకత్వం వహించాడు. 1995లో 'మైదాన్-ఎ-జంగ్' చిత్రం ఆయన నటించిన చివరి సినిమా. అవార్డులు, గౌరవాలు మనోజ్ కుమార్ భారతీయ సినిమాకు చేసిన కృషికి గాను 1992లో పద్మశ్రీ, 2015లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు.

## డీఎంకే సర్కార్‌కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ/చెన్నై :** వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష విషయంలో డీఎంకే ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. నీట్ పరీక్ష నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు చేసిన అభ్యర్థనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆ రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. తమ ప్రభుత్వం అన్ని వివరణలు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నీట్‌ను ఉప సంహరించుకోలేదన్న ఆయన.. ఈ వ్యవహారంలో తమిళనాడు చేస్తున్న పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు ఈ నెల 9వ తేదీన పార్టీలకతీతంగా ఎమ్మెల్యేందరితోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ఎప్పటి నుంచో పోరాటం చేస్తోంది. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ, పరీక్షను క్లియర్ చేయలేని స్థితిలో పలువురు అభ్యర్థులు బలవన్మరణానికి పాల్పడడంతో ఇదొక తీవ్ర అంశంగా మారిందక్కడ. కోచింగ్‌లకు వెళ్లే స్తోమత లేని విద్యార్థుల పాలిట ఇదొక శాపంగా మారిందనే అభిప్రాయం అక్కడ వ్యక్తమైంది. సామాజిక న్యాయం దక్కాలంటే నీట్ వద్దనే నినాదంతో పోరాడుతూ వస్తోంది. అందుకే నీట్ బదులు 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి తమిళనాడును అనుమతించాలని తమిళనాడు ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది. అయితే.. 2021-22 నుంచే అది పెండింగ్‌లో ఉంటూ వస్తోంది. ఈ క్రమంలో.. కిందటి ఏడాది జూన్‌లో తమిళనాడు ప్రభుత్వం ఏకగ్రీవంగా నీట్‌ను రద్దు చేయాలంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది కూడా. అయినప్పటికి కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు. తాజా ఎదురు దెబ్బపై స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. దక్షిణ రాష్ట్రం మరోసారి అవమానానికి గురైందని అన్నారు. 'కేంద్రం తమిళనాడు అభ్యర్థనను తిరస్కరించవచ్చు. కానీ, మన పోరాటం మాత్రం ఆగదు. న్యాయ నిపుణులపై చర్చించి ఈ నిర్ణయాన్ని సవాల్ చేసే అంశం పరిశీలిస్తాం అని స్టాలిన్ ప్రకటించారు. మరోవైపు తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్ కూడా నీట్‌కు వ్యతిరేకంగా ఓ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఇంకోవైపు.. కాంగ్రెస్, ఆర్జేడీ లాంటి పార్టీలు కూడా నీట్‌ను మొదటి నుంచే వ్యతిరేకిస్తూ వస్తున్నాయి.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ పార్టీ



**న్యూఢిల్లీ:** బీజేపీ సర్కారు తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ఆ బిల్లు పాసైన విషయం తెలిసిందే. ఆ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అయితే ఆ బిల్లుకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లనున్నట్లు ఇవాళ కాంగ్రెస్ పార్టీ నేత జయరాం రమేశ్ తెలిపారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో ట్వీట్ చేశారు. 2019లో ప్రభుత్వం తెచ్చిన సీఏఏను సుప్రీంలో సవాల్ చేశామని, 2005 ఆర్టీఐ చట్టం సవరణను ప్రశ్నిస్తూ సుప్రీంలో సవాల్ చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ అంశంపై తెచ్చిన సవరణలను ప్రశ్నిస్తూ కూడా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పార్టీ కేసు ఫైట్ చేస్తోందన్నారు. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం అమలను నిలదీస్తూ కూడా సుప్రీంలో కేసు వేశామన్నారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టులో పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన అసదుద్దీన్ ఒవైసీ

**ఢిల్లీ:** వక్ఫ్ బిల్లుపై అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీం కోర్టులో ఆయన సవాల్ చేశారు. వక్ఫ్ బిల్లు చట్ట విరుద్ధమని.. వక్ఫ్ ఆస్తులు లాక్కునే కుట్ర జరుగుతోందంటూ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఈ వివాదాస్పద బిల్లు ఆమోదం పొందడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. కాగా, రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు%-%2025పై పార్లమెంటు ఆమోదముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది.

# అమెరికన్ గోల్డ్ కార్డుకు భారీగా స్పందన

**ఇప్పటికే వేయి కార్డులు జారీ అయినట్లు సమాచారం**

**ట్రంప్ విధానాలతో హెచ్-1 వీసాదారుల్లో భయం**

**దేశం విడిచి వచ్చేందుకు వెనుకంజ**




వాషింగ్టన్, ఏప్రిల్ 5 అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే గోల్డ్ కార్డు ఆఫర్ ప్రకటించిన వెంటనే భారీగా స్పందన వస్తోంది. ఆదాయం పెంచుకునేందుకు ట్రంప్ వేసిన ఎత్తుగడలు ఫలిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు వెల్లడించాక పలువురు ఆసక్తి చూపుతున్నారు. 5 మిలియన్ డాలర్లు అంటే సుమారు 44 కోట్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని ఇస్తున్నారు. ట్రంప్ ప్రకటించిన ఈ గోల్డ్ కార్డుకు అమెరికాలో భారీ స్పందన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా గోల్డ్ కార్డుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అధ్యక్షుడు విడుదల చేశారు. ట్రంప్ చిత్రంతో ఉన్న ఈ గోల్డ్ కార్డును ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడే సమయంలో చూపించారు. ఈ గోల్డ్ కార్డును 5 మిలియన్ డాలర్లు చెల్లించి ఎవరైనా సొంతం చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాదు ఈ గోల్డ్ కార్డును తానే మొదట కొనుగోలు చేసినట్లు ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రకటించారు. రెండో కొనుగోలుదారు ఎవరో తనకు తెలియదని చెప్పారు. ఈ గోల్డ్ కార్డు రెండు వారాల్లో అమ్ముడ యిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పౌరసత్వ కార్డుల ద్వారా వేగంగా జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని కొంత వరకు తగ్గించవచ్చన్న అభిప్రాయంలో ట్రంప్ ఉన్నారు. ఈ క్రమంలో ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్డ్ కార్డు ఆఫర్లను ప్రకటించారు. ఈబీ-5 ప్రోగ్రామ్ ద్వారా అమెరికాలో పెట్టు-బడి పెట్టే విదేశీయులకు గ్రీన్ కార్డు ఇస్తారు. గోల్డ్ కార్డులను అమ్మనున్నామని, 5 మిలియన్ల డాలర్లకే ఆ కార్డును ఇవ్వనున్నట్లు- ట్రంప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించారు. ట్రంప్ ప్రకటనతో ఈ గోల్డ్ కార్డులకు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం ఒక్కరోజులోనే ఏకంగా 1,000 గోల్డ్ కార్డులు విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ ఇటీ-వలే వెల్లడించారు. వీటి ద్వారా దాదాపు 5 బిలియన్ డాలర్లు సేకరించినట్లు- తెలిపారు. 'ప్రపంచ వ్యాప్తంగా 37 మిలియన్ల మందికి గోల్డ్ కార్డును కొనుగోలు చేయగల సామర్థ్యం ఉంది. ఒక మిలియన్ మంది వీటిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉంది' అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ గోల్డ్ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ.. అధ్యక్షుడు ట్రంప్‌దే అని బదులిచ్చారు. 'పెట్టుబడిదారు జాన్ పాల్సన్‌తో జరిగిన సమావేశంలో ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచన ఇది. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే నా బాధ్యత. ఇందుకోసం నా వద్ద ప్రణాళిక ఉంది' అని చెప్పుకొచ్చారు. ఇకపోతే అమెరికా వలస విధానాల్ని మరింత కఠినతరం చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్వదేశానికి వెళ్తే.. తిరిగి అమెరికాకు రానిస్తారా? లేదా? అన్నదానిపై హెచ్1బీ వీసాదారులలో అనుమానాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రఖ్యాత టెక్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. తమ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్1బీ వీసాదారులను అప్రమత్తం చేస్తూ.. దేశాన్ని వీడొద్దని సూచించాయి. మళ్లీ అమెరికాకు తిరిగిరావడానికి అనుమతి ఉంటుందో? లేదోననే అనుమానాలు ఉన్నందున.. ఈ హెచ్చరికలు జారీచేస్తున్నట్టు సదరు కంపెనీలు పేర్కొన్నాయి. అమెరికాను వీడొద్దంటూ ఆయా ఐటీ కంపెనీలు తమ సిబ్బందికి ఇప్పటికే సూచించాయి. దీంతో భారత్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నట్టు పలువురు హెచ్1 బీ వీసాదార్లు చెప్పినట్టు 'వాషింగ్టన్ పోస్ట్' కథనం పేర్కొన్నది. ఒకవేళ చట్టాన్ని మార్చితే, వలసదార్ల పిల్లల పౌరసత్వం అగమ్యగోచరంగా మారేట్టు ఉందని ఒకరు వాపోయారని వార్తా కథనం తెలిపింది. అమెరికా పౌరులు మినహా, మిగతా అందరూ అక్రమ వలసదారులే అన్న భావన అక్కడ నెలకొని ఉందని భారతీయ వలసదారులు చెబుతున్నారు. దీంతో తాము ఎక్కడికి వెళ్లినా అవసరమైన పత్రాలన్నీ వెంట తీసుకెళ్తున్నామని చెప్పారు.

## రూ.500, రూ.10 నోట్లకు సంబంధించి కీలక అప్‌డేట్..




దేశానికి కొత్త ఆర్‌బీఐ గవర్నర్ వచ్చినప్పటి నుంచి కొత్త కొత్త అప్‌డేట్స్ వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆర్థిక వ్యవస్థకు సంబంధించి సానుకూల వార్త వెలుగులోకి వచ్చింది. ద్రవ్యోల్బణం తగ్గిందని, దీంతో పాటు వడ్డీ రేట్ల తగ్గింపు ప్రక్రియ కూడా ప్రారంభమైందన్నారు. మరోవైపు 10 రూపాయలు, 500 రూపాయల నోట్లకు సంబంధించి RBI గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్ కింద కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.10, రూ.500 నోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం తెలిపింది.

**చట్టబద్ధంగా చెలామణి..**

ఈ నోట్ల డిజైన్ అన్ని విధాలుగా మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని రూ. 10, రూ. 500 నోట్లను పోలి ఉంటుందని సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త నోట్లను జారీ చేసినప్పటికీ, రిజర్వ్ బ్యాంక్ గతంలో జారీ చేసిన రూ.10, రూ.500 డినామినేషన్లలోని అన్ని (పాత) నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతాయి. గవర్నర్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.100, రూ.200 నోట్లను కూడా విడుదల చేస్తున్నట్లు ఆర్‌బీఐ గత నెలలో ప్రకటించింది. మల్హోత్రా డిసెంబర్ 2024లో RBI గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆరు సంవత్సరాలు గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ స్థానంలో ఆయన నియమితులయ్యారు.

**9న రెపో రేటు ప్రకటన..**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ సమావేశం ఏప్రిల్ 7 నుంచి మొదలు కానుంది. ఏప్రిల్ 9న ఆర్‌బీఐ గవర్నర్ పాలసీ రేటును ప్రకటిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది మొదటి సమావేశం కాబట్టి, దీనిని చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సమావేశంలో రెపో రేటులో 0.25% కోత చూడవచ్చు. ఇదే జరిగితే రెపో రేటు వరుసగా రెండోసారి తగ్గుతుంది. ఆ తర్వాత రెపో రేట్లు 6 శాతానికి తగ్గుతాయి. ఈ నిర్ణయం ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇస్తుంది. ఫిబ్రవరిలో, ఆర్‌బీఐ గవర్నర్ 0.25 శాతం కోతను ప్రకటించారు.

## 5 రోజుల పెరుగుదలకు బ్రేక్.. భారీగా తగ్గిన గోల్డ్ ధర..



పసిడి ప్రియులకు అదిరి పోయే వార్త వచ్చేసింది. భారత బులియన్ మార్కెట్‌లో గత ఐదు రోజులుగా భారీగా పెరిగిన ధరలకు శుక్రవారం (ఏప్రిల్ 4న) బ్రేక్ పడింది. ఈ క్రమంలో శుక్రవారం బంగారం ధరలు 10 గ్రాములకు రూ.1,350 తగ్గి రూ. 93,000కి చేరుకున్నాయి. ఇది ఒక కీలక పరిణామంగా చెప్పుకోవచ్చు. అంతకుముందు గురువారం (ఏప్రిల్ 3) 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.200 పెరిగి రూ. 94,350కి చేరుకుంది.

**వెండి ధరలు కూడా పడిపోవడం**

గోల్డ్ ధరల తగ్గుదలతో పాటు, వెండి ధరలు కూడా గణనీయంగా పడిపోయాయి. వెండి ధర కిలోకు రూ.5,000 తగ్గి రూ.95,500కి చేరుకుంది. ఇది గత 4 నెలల్లో జరిగే అతిపెద్ద పతనంగా భావించవచ్చు. గత ట్రేడింగ్ సెషన్‌లో, వెండి ధర రూ. 1,00,500 వద్ద ముగిసింది.

**కారణమిదేనా..**

ఇది ప్రధానంగా గ్లోబల్ మార్కెట్‌లో మారుతున్న పరిస్థితుల కారణంగా జరిగిందని నిపుణులు చెబుతున్నారు. దీంతోపాటు అమెరికా దిగుమతులపై చైనా 34 శాతం సుంకాలు విధిస్తామని చెప్పడం కూడా ఓ కారణమని అంటున్నారు. మరోవైపు మారిన ప్రజల ఆర్థిక మార్పులు, వృద్ధి అవకాశాలపై మారిన ధోరణుల వల్ల ట్రేడింగ్ సెంటిమెంట్ బలహీనంగా మారిందని తెలుస్తోంది. ఈ క్రమంలో మార్కెట్ పడిపోయినప్పుడు మంచి లాభాలు రావచ్చని, కానీ, భవిష్యత్తులో మరింత పెరుగుదల కంటే, రేట్లు పడిపోయినా ఆశ్చర్యం లేదని నిపుణులు చెబుతున్నారు.

**అంతర్జాతీయ మార్కెట్ విశ్లేషణ**

గ్లోబల్ ఫ్రంట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు US \$21.74 లేదా 0.70 శాతం తగ్గి US \$3,093.60కి చేరుకుంది. ఈ మార్పు ట్రేడర్లను ఒక రకమైన అనిశ్చితి, జాగ్రత్తలను సూచిస్తుంది. అలాగే ఆసియా మార్కెట్లలో వెండి ధర కూడా 1.69 శాతం పడిపోయి 31.32 డాలర్లకు చేరుకుంది. ఈ క్రమంలో గోల్డ్, వెండి, ఇతర విలువైన లోహాల ధరలను మార్కెట్ సెంటిమెంట్లతో పాటు జాగ్రత్తగా పరిశీలించాలని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పతనాలు లేదా ప్రతికూల పరిస్థితులు వస్తే, బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ డాలర్ బలహీనపడటం వంటి అంశాల కారణంగా పసిడి ధరలు తగ్గుముఖం పడతాయి.

## 7 శతాబ్దాల సీతారామస్వామి ఆలయం.. దేదీప్యమానంగా వెలుగుతున్న అఖండ దీపం



గంభీరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో సుమారు 7 శతాబ్దాల క్రితం కాకతీయుల కాలంలో సీతారామస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం కాకతీయుల ఆధ్యాత్మికత వైభవానికి ప్రతీక. ప్రాచీన రాతి శిలలచే నిర్మించిన ఆలయంలో కాకతీయులు వెలిగించిన దీపం అఖండ దీపమై నేటికీ దేదీప్యమానంగా వెలుగుతుంది. ఈ ఆలయ మరో ప్రత్యేకత మూలవిరాట్ భద్రాచల రామయ్యను పోలి ఉండడం. 16 రాతి స్తంభాలతో ఏర్పాటైన గర్భాలయం, 16 రాతి స్తంభాలతో కూడిన మూక మండపం, 16 రాతి స్తంభాలతో కూడిన కళ్యాణ మండపం ఆలయ చరిత్రను పురాతన గంటపైన సాంస్కృత భాషలో లిఖించి ఉంది. ఈ ఆలయంలో ప్రతి ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకొని నావాంహిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అశ్వ, గజ,శేష, సూర్యప్రభ, పొన్న, గరుడ, రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి. చుట్టు పక్క గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో గరుడ, రథోత్సవాలను చూసి తరిస్తారు. 2018 న ఆలయ పునర్నిర్మాణం ప్రారంభించి ఆలయ గోపురం, సలారం, ప్రతిష్ట చేశారు. పునర్నిర్మాణం కోసం భక్తులు విరాళాలు అందించి సహకరించారు. ఆలయ గాలిగోపురం పూర్తి చేయాల్సి ఉంది. పురాతన ఆలయాల పునర్నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ కోరుతున్నారు.

## టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్. నాయుడుకి కేంద్ర మంత్రి బండిసంజయ్ లేఖ



కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో భూమి పూజ చేసిన స్థలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయాన్ని నిర్మించడానికి సహకరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ బీఆర్. నాయుడుకి బండి సంజయ్ లేఖ రాశారు. గత రెండు సంవత్సరాలుగా వాయిదా పడిన ఓ ముఖ్యమైన విషయాన్ని టీటీడీ దృష్టికి తీసుకురావాలని అనుకున్నట్లు తెలిపారు. 2023లో కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి ఇచ్చారని, రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లాలో పద్మనగర్‌లో పది ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించిందని పేర్కొన్నారు. 2023 మే 31న రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధుల సమక్షంలో భూమి పూజ కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. కానీ దురదృష్టవశాత్తు ఆలయ నిర్మాణంలో ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కరీంనగరే కాదు చుట్టుపక్కల జిల్లాల భక్తులు కూడా ఈ ఆలయ నిర్మాణం కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని వివరించారు.

ప్రస్తుతం మీ నేతృత్వంలో టీటీడీ దేశవ్యాప్తంగా హిందూ ధర్మ ప్రచారంతో పాటు హిందూ దేవాలయాల నిర్మాణ అభివృద్ధికి సహకరిస్తుండడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందని వెల్లడించారు. ధూప-దీప నైవేద్యాలకు నోచుకోని అనేక దేవాలయాలను మీరు ఆదుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో భూమి పూజ చేసిన స్థలంలో దేవాలయాన్ని నిర్మించడానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక, ప్రధాని నరేంద్ర మోడీ మద్దతుతో, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధిని చూడబోతోందని పేర్కొన్నారు. మీ నాయకత్వంలో భక్తులంతా భక్తిపూర్వకంగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు అందుకోవడానికి, దివ్య కృపను పొందేందుకు ప్రేరణనిస్తుందని వెల్లడించారు. మీరు ఇప్పటికే చేపట్టిన కొన్ని మంచి చర్యలు భక్తుల నుంచి విశేషమైన ప్రశంసలు వస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు.

## ప్రతి పోలీసుకు క్రమశిక్షణ తప్పనిసరి : ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ : పోలీస్ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ ఎంతో అవసరం అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పరేడ్ నిర్వహిస్తారని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన పరేడ్ లో జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొదటగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, జిల్లా ఎస్పీ గౌరవ వందనాన్ని సమర్పించి, పరేడ్ ను ప్రారంభించారు. 9 ప్లాటోన్ లతో కూడిన పరేడ్ విడతలవారీగా జిల్లా ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పరేడ్ వల్ల మానసిక ఉల్లాసం, ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలియజేశారు.

పోలీసు సిబ్బంది మధ్య ఒకరి పట్ల ఒకరికి గౌరవం, సత్సంబంధాలు మెరుగుపడతాయని తెలియజేశారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి పోలీసు క్రమశిక్షణ అనేది మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరికి పోలీసు క్రమశిక్షణ అనేది ముఖ్యమైనదని అన్నారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని, దానిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి పోలీస్ స్టేషన్ల వారిగా వారాంతపు సెలవును అమలు చేయాలని సూచించారు. సిబ్బంది అనవసరంగా విధులకు గైర్హాజరు కాకుండా ఉండాలని తెలిపారు. క్రమశిక్షణ తప్పిన ఉద్యోగుల పై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, ఇన్స్పెక్టర్లు,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠభరిత మ్యాచ్‌లో లక్నో విజయం

## మార్ష్, మార్క్రమ్ రాణించడంతో 203 స్కోరు చేసిన లక్నో

## ఛేదనలో పోరాడి ఓడిన ముంబై

## సూర్య, నమన ధిర్ పోరాటం వృథా



గత మ్యాచ్ లో ఓడిన లక్నో సూపర్ జెయింట్స్ గాడిన పడింది. ముంబై ఇండియన్స్పై అద్భుతమైన విజయం సాధించింది. చివరి ఓవర్ వరకూ ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్ లో విజయం లక్నోనే వరించింది. ముంబై తీవ్రంగా పోరాడినప్పటికీ నిరాశ తప్పలేదు. లక్నో వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్ లక్నో 12 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 203 రన్స్ చేసింది. ఓపెనర్లు మార్ష్ (60), మార్క్రమ్(53) హాఫ్ సెంచరీలతో రాణించగా.. ఆయుశ్ 30), 25(27) విలువైన రన్స్ జోడించడంతో లక్నోకు భారీ స్కోరు దక్కింది. ముంబై బౌలర్లలో హార్దిక్ పాండ్యా(5/36) సత్తాచాటాడు. అనంతరం ఛేదనలో ముంబై పోరాటం వృథా అయ్యింది. సూర్యకుమార్ (67) రాణించగా.. నమన్ ధీర్ (46). పాండ్యా(28) కీలక ఇన్నింగ్స్ ఆడారు. చివరి వరకూ పోరాడిన ఆ జట్టు 191/5 స్కోరుకే పరిమితమైంది.

**ఆఖరి రెండు ఓవర్లలో..**

ఓపెనర్లు విల్ జాక్స్(5), రికెల్టన్(10) నిరాశపర్చడంతో ముంబైకి ఛేదనలో పేలవ ఆరంభమే దక్కింది. ఆ తర్వాత సూర్యకుమార్, నమన్ ధీర్ జట్టును గాడిలో పెట్టారు. ఇద్దరూ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. సూర్యతో పోలిస్తే నమన్ ధీర్ ఇంకాస్త దూకుడుగా ఆడాడు. ఈ జోడీ మూడో వికెట్కు 69 రన్స్ జోడించింది. ప్రమాదకరంగా మారిన ఈ జంటను దిగ్వేశ్ విడదీశాడు. నమన్ ధిర ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ క్రీజులో.సౌకర్యంగా కనిపించాడు. అయితే, మరో ఎండ్లో సూర్య మాత్రం రెచ్చిపోయాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేయ డంతోపాటు ముంబైని విజయం దిశగా నడిపించాడు. ముంబైకి 24 బంతుల్లో 52 రన్స్ కావాల్సి రావడంతో మ్యాచ్ లక్నోకు దూరమయ్యేలా కనిపించింది. కానీ, సూర్యను అవేశ్ ఖాన్ అవుట్ చేసి లక్నోకు ఊరటనిచ్చాడు. అయితే, హార్దిక్ పాండ్యా దూకుడుగా ఆడి ముంబైని తిరిగి పోటీలోకి తెచ్చాడు. 12 బంతుల్లో 29 రన్స్ చేయాల్సి రావడంతో ముంబైనే గెలిచేలా కనిపించింది. అయితే, చివరి రెండు ఓవర్లలో శార్దూల్ ఠాకూర్, అవేశ్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేసి లక్నోకు విజయాన్ని కట్టబెట్టారు.



లక్నో ఇన్నింగ్స్ మిచెల్ మార్ష్ రెచ్చిపోయాడు. ఓపెనర్ గా వచ్చిన అతను పవర్ ప్లేలో ముంబై బౌలర్లపై విరుచుకపడ్డాడు. 31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులతో 60 రన్స్ చేశాడు. మార్ విధ్వంసంతో తొలి ఓవర్లలో 69 రన్స్ రావడంతో లక్నోకు అదిరి పోయే ఆరంభం దక్కింది. అయితే, 7వ ఓవర్లో మార్ష్ దూకుడుకు ముంబై యువ బౌలర్ విఘ్నేశ్ చెక్ పెట్టాడు. ఇక మరో ఓపెనర్ మార్క్రమ్ కూడా రాణించాడు. హాఫ్ సెంచరీతో మెరిశాడు. మార్ష్ క్రీజులో ఉన్నంత సేపు నిదానంగా ఆడిన అతను ఆ తర్వాత సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. మార్క్రమ్ తర్వాత ఆయుశ్ బదోని (30). డేవిడ్ మిల్లర్ (27) కాసేపే క్రీజులో ఉన్న ధాటిగా ఆడి విలువైన రన్స్ జోడించారు. దీంతో లక్నో 200 పరుగుల మార్కు దాటింది. లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ (2) మరోసారి దారుణంగా విఫలమయ్యాడు. పూరన్ (12) కూడా ఆరు బంతులే ఎదుర్కొని వికెట్ పారేసుకున్నాడు. వీరిద్దరూ పాండ్యా బౌలింగ్లో అవుటయ్యారు. ఈ మ్యాచ్లో పాండ్యా 5 వికెట్లతో చెలరేగాడు. పంత్, పూరన్లతోపాటు మిల్లర్. మార్క్రమ్, ఆకాశ్ దీప్ వికెట్లు తీశాడు.

## రేర్ టాలెంట్ బౌలర్ కమిందు మెండిస్

ఐపీఎల్లో గురువారం మ్యాచ్ లో అద్భుతం చోటు చేసుకుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ అరంగేట్ర ఆటగాడు, కమిందు మెండిస్ జాదూ చేశాడు. శ్రీలంకకు చెందిన ఈ ఆల్ రౌండర్ కు విశేష ప్రతిభ ఉంది. రెండుచేతులతోనూ స్పిన్ వేయగల నైపుణ్యం అతని సొంతం. తాజాగా కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్ లో తన మాయజాలాన్ని ప్రదర్శించాడు. అలాగే ఒక్క ఓవర్ వేసి అంగ్ క్రిష్ రఘువంశీ వికెట్ ను కూడా సాధించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్లో ఎప్పటి నుంచో ఇలా రెండు చేతులతో వేస్తున్న కమిందు.. ఐపీఎల్లో మాత్రం తొలిసారి తన ఘనతను ప్రదర్శించాడు. ఇక ఇన్నింగ్స్ 13వ ఓవర్ వేసిన కమిందు.. లెఫ్ట్ హేండ్ బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ కు కుడి చేతితోనూ, రఘువంశీకి ఎడమ చేతితోనూ బౌలింగ్ చేసి సానుకూల ఫలితాన్ని పొందాడు. ఇలా రెండు చేతులతోనూ బౌలింగ్ చేయడాన్ని అంబిడక్ట్రస్ బౌలింగ్ అని అంటారు. అయితే ఈమ్యాచ్ లో సన్ కెప్టెన్ పాట్ కమిన్స్ కేవలం ఒక్క ఓవర్ మాత్రమే కమిందుకు ఇవ్వడం విశేషం. ఇక కమిందు రెండు చేతులతోనూ బౌలింగ్ చేస్తున్న వీడియో తాజాగా వైరలైంది. ఇదేప్పుడు తాము చూడలేదని, కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లు విపరీతంగా నెటిజన్లు చేస్తున్నారు. ఇక ఈ మ్యాచ్ లో తన బ్యాటింగ్ ప్రతిభను కూడా కమిందు చాటుకున్నాడు. మూడు వికెట్లు పడటంతోనే ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే తను బ్యాటింగ్ కు వచ్చాడు. ఆ తర్వాత తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (19)తో 35 పరుగుల మంచి భాగస్వామ్యం ఏర్పాటు చేశాడు. ఇక కుదురుకున్నాక రెండు భారీ సిక్సర్లు కూడా బాదాడు. మొత్తానికి 20 బంతుల్లో 27 పరుగులు చేసిన కమిందు.. ఒక ఫోర్, రెండు సిక్సర్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే స్కోరు వేగాన్ని పెంచే క్రమంలో తను ఔటయ్యాడు. ఆల్ రౌండర్ గా తనకు మంచి భవిష్యత్తు ఉందని అభిమానులు పేర్కొంటున్నారు. తనకు తరచూ తుదిజట్టులో చోటు కల్పించాలని సూచిస్తున్నారు. గత సీజన్ లో సంచనల బ్యాటింగ్ తో అల్లాడించిన సన్.. ఈ సీజన్ లో చతికిల పడుతోంది. తాజాగా వరుసగా మూడో మ్యాచ్ లో బ్యాటింగ్ వైఫల్యంతో ఓటమిపాలైంది. తొలుత బౌలింగ్ లో భారీ పరుగులు సమర్పించుకున్న సన్.. ఆ తర్వాత బ్యాటింగ్ లోనూ తేలిపోయింది. దీంతో డిఫెండింగ్ చాంపియన్స్ కోల్ కతా నైట్ రైడర్స్ చేతిలో 80 పరుగులతో ఓటమి పాలైంది. గురువారం జరిగిన మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసింది. స్టార్ ఆల్ రౌండర్ వెంకటేశ్ అయ్యర్ (60)తో విధ్వంసం సృష్టించాడు. బౌలర్లలో మహ్మద్ షమీ (1-29) పొదుపుగా బౌలింగ్ చేశాడు. అనంతరం ఛేదనలో సన్ రైజర్స్ 16.4 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. హెన్రిచ్ క్లాసెన్ (21 బంతుల్లో 33, 2 ఫోర్లు, 2 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన వైభవ్ అరోరా 3 టాప్ వికెట్లతో సత్తాచాటాడు., వరుణ్ చక్రవర్తి కూడా మూడు కీలక వికెట్లతో ఆకట్టుకున్నారు. ఈ ఫలితంలో హ్యాట్రిక్ పరాజయాలను సన్ నమోదు చేసింది. పట్టికలో పదోస్థానానికి దిగజారింది. ఇక తమ తర్వాతి మ్యాచ్ ను హైదరాబాద్ లో గుజరాత్ టైటాన్స్ తో ఆదివారం (ఈనెల 6న) సన్ ఆడబోతోంది.

## ఐపీఎల్‌కు ధోని ఎంతో విలువ తీసుకోచ్చాడు





### మరింత వన్నె తేవడంలో ధోనిదే కీలక పాత్ర

### భారత ఆటగాళ్లకు రేటింగ్ ఇచ్చిన క్రిస్ గేల్

వెస్టిండీస్ దిగ్గజ బ్యాటర్ క్రిస్ గేల్ ఐపీఎల్‌లో చాలా కాలం పాటు ఆధిపత్యం చెలాయించాడు. ఐపీఎల్‌లోని చాలా రికార్డులు ఇప్పటికీ క్రిస్ గేల్ పేరు మీద నమోద చేయబడ్డాయి. 2013లో పుణె వారియర్స్ క్రిస్ గేల్ 175 పరుగులు చేశాడు. ఇది ఐపీఎల్ చరిత్రలోనే ఓ బ్యాటర్ చేసి అత్యధిక స్కోరు. క్రిస్ గేల్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడాడు. భారత క్రికెట్ గురించి క్రిస్ గేల్ కు చాలా వరకు తెలుసు. ఈ క్రమంలో క్రిస్ గేల్ కొంత మంది భారత ఆటగాళ్లకు రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు సీఎస్కే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని క్రేజ్ గురించి కూడా క్రిస్ గేల్ మాట్లాడాడు. ఐపీఎల్‌కు ఎంఎస్ ధోని ఎంతో విలువ తీసుకోచ్చాడని గేల్ చెప్పాడు. మరింత వన్నె తేవడంలో ధోనిదే కీలక పాత్ర అని అన్నాడు. వెస్టిండిస్ దిగ్గజం క్రిస్ గేల్ భారత ఆటగాళ్లకు రేటింగ్ ఇస్తూ ఆసక్తికరమైన విషయాలు చెప్పాడు. భారత క్రికెటర్ల రేటింగ్ ఇవ్వాల్సి వస్తే.." రుతురాజ్ గైక్వాడ్‌కు 7, యశస్వి జైస్వాల్‌కు 9, శుభ్‌మన్ గిల్‌కు 9 రేటింగ్ ఇస్తాను. సన్ రైజర్స్ హైదరాబాద్ కు అద్భుత ఆరంభాలు ఇచ్చిన అభిషేక్ శర్మకు 8 మార్కులు కేటాయిస్తా. కేఎల్ రాహుల్‌కు 8, సూర్యకుమార్ యాదవ్‌కు 9, హార్దిక్ పాండ్యాకు 7 మార్కులు ఇస్తాను. శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ లకు చెరో 8 మార్కులు ఇస్తాను."అని క్రిస్ గేల్ వెల్లడించాడు. ఇదిలా ఉండగా.. లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేయడంపై విమర్శలు ఎదుర్కొంటున్న ఎంఎస్ ధోనికి క్రిస్ గేల్ మద్దతు ఇచ్చాడు. ఐపీఎల్‌కు ధోని చాలా ముఖ్యమని క్రిస్ గేల్ అభిప్రాయపడ్డాడు. ధోనితో ఐపీఎల్ కు విలువ పెరుగుతుందని.. అతడు ఎంతకాలం ఆడాలనుకుంటే అప్పటిదాకా కొనసాగించాలని అన్నాడు. ఐపీఎల్ నుంచి ధోని తప్పుకోవాలని ఎవరూ అనుకోవద్దన్నాడు. గొప్ప వ్యక్తిపై మనం అలా స్పందిస్తే అభిమానులకు తప్పుడు సందేశం వెళ్తుందన్నాడు. తన జట్టును ఛాంపియన్ గా నిలిపిన ధోని ఒక వేళ టోర్నీ నుంచి నిష్క్రమిస్తే సీఎస్కే కాదు.. టోర్నీకి కూడా ఇబ్బందికరమేనని క్రిస్ గేల్ అన్నాడు. ధోని లాంటి వ్యక్తికి మీరు అలాంటి సందేశం పంపకూడదని.. ఎందుకంటే ధోని ఐపీఎల్‌కు చాలా విలువను తీసుకొచ్చాడని క్రిస్ గేల్ పేర్కొన్నాడు. ఈ సీజన్ లో 9వ నంబర్ లో ధోనీ బ్యాటింగ్ కు రావడం గేల్ స్పందించాడు. ధోని ఎక్కడ ఆడినా అభిమానులు భారీగా వస్తారని.. ఇలాంటి వ్యక్తితో ఐపీఎల్ విలువ భారీగా పెరుగుతూనే ఉంటుందన్నాడు. ఇప్పటికీ ఎంఎస్ ధోని వికెట్ కీపింగ్ నైపుణ్యం అద్భుతమని చెప్పుకొచ్చాడు. ప్రతి ఒక్కరూ ధోని నైపుణ్యాలను చూడాలనుకుంటారని.. ధోని 11వ స్థానంలో వచ్చినా ఇబ్బందేం లేదన్నాడు. ధోనిని మైదానంలో చూసేందుకే ఫ్యాన్స్ స్టేడియాలకు వస్తారని.. ధోని వల్లే ప్రేక్షకులు సీఎస్కేకు మద్దతు ఇస్తారని క్రిస్ గేల్ చెప్పుకొచ్చాడు.


## చేయాల్సిన టైమ్‌లో నేను అన్నీ చేశాను

### ముంబయి స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ



లఖ్‌నవూ జట్టు బౌలింగ్ కోచ్ జహీర్ ఖాన్‌తో ముంబయి స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో రోహిత్ సీరియస్‌గానే మాట్లాడుతున్నట్లు కనిపిస్తోంది. 'చేయాల్సిన టైమ్‌లో నేను అన్నీ చేశాను. ఇప్పుడు నేను ఏమీ చేయాల్సిన అవసరం లేదు' అని రోహిత్ జహీర్‌తో అన్నాడు. అయితే ఈ మాటలు ముంబయి మేనేజ్?మెంట్?ను ఉద్దేశించే అన్నాడని నెటిజన్లు భావిస్తున్నారు. కెప్టెన్?గా ఉన్నప్పుడు జట్టుకు చేయాల్సిందంతా చేసేశాడు. ఇప్పుడు తాను ఏం చేయాల్సిన అవసరం లేదని జహీర్?తో చెప్పాడని అభిప్రాయపడుతున్నారు. కెప్టెన్సీ బాధ్యతలు లేవు కాబట్టి బ్యాటింగ్ మాత్రమే తన పని అంటున్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే 2024 సీజన్?కుగానూ రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యను ముంబయి మేనేజ్?మెంట్? కెప్టెన్?గా నియమించింది. అప్పట్లో దీనిపై రోహిత్ అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో రోహిత్ ముంబయి జట్టును వీడతాడని ప్రచారం జరిగింది. కానీ, 2025 ఐపీఎల్?కు రోహిత్‌ను ముంబయి 16.30 కోట్లకు రిటైన్ చేసుకుంది.

## ఐపీఎల్ నుంచి వైదొలిగిన కగిసో రబాడా



గుజరాత్ టైటాన్స్ జట్టుకు చెందిన బౌలర్ కగిసో రబాడా ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. వ్యక్తిగత కారణాల వల్ల ఈ సౌతాఫ్రికా పేసర్ స్వదేశం వెళ్లిపోయాడు. ఈ మేరకు గుజరాత్ టైటాన్స్ ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే రబాడ స్వదేశం నుంచి ఎప్పుడు తిరిగి వస్తాడో, జట్టుతో ఎప్పుడు చేరుతాడో మాత్రం వెల్లడించలేదు. ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఆడాడు రబాడా. ఈ రెండు మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. పంజాబ్ కింగ్స్‌పై 1/41, ముంబయి ఇండియన్స్‌పై 1/42 బౌలింగ్ గణాంకాల్ని నమోదు చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో రబాడకు అవకాశం రాలేదు. అతని స్థానంలో జట్టులోకొచ్చిన అర్షద్ ఖాన్ కీలకమైన విరాట్ కోహ్లీ వికెట్ తీశాడు. రబాడ గైర్హాజరీలో జెరాల్డ్ కొయెట్జీ (దక్షిణాఫ్రికా) లేదా ఆల్ రౌండర్ కరీమ్ జన్నత్ (అఫ్గానిస్తాన్)ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అలాగే కివీస్ ఆల్ రౌండర్ గ్లెన్ ఫిలిప్ ఇంకా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అతడిని జట్టులోకి తీసుకునే అవకాశాలు లేకపోలేదు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడాను గుజరాత్ టైటాన్స్ ఈ ఐపీఎల్ మెగా వేలంలో రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ కెరీర్‌లో రబాడాకు మంచి రికార్డు ఉంది. ఆడిన 82 మ్యాచ్?ల్లో 22.29 యావరేజ్‌తో 119 వికెట్లు పడగొట్టాడు.ప్రస్తుతం పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ నాలుగో స్థానంలో ఉంది. మూడు మ్యాచ్?ల్లో రెండింట్లో గెలిచింది. మొదటిస్థానంలో పంజాబ్, రెండో ప్లేస్?లో దిల్లీ, ఆ తర్వాతి స్థానాల్లో ఆర్సీబీ, గుజరాత్, కేకేఆర్, ముంబయి ఇండియన్స్, లఖ్?నవూ, చెన్నై, రాజస్థాన్, సన్ రైజర్స్ ఉన్నాయి. కాగా, గుజరాత్ టైటాన్స్ తన తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 6న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఏప్రిల్ 9న రాజస్థాన్ రాయల్స్‌ను ఢీకొట్టనుంది.

## రహానె, జైస్వాల్ మధ్య విభేదాలు నిజమేనా?

### గోవాలో జైస్వాల్ చేరడం సంచలనం!

యంగ్ టాలెంటెడ్ ప్లేయర్ యశస్వి జైస్వాల్ ముంబైని విడిచిపెట్టి తదుపరి డొమెస్టిక్ సీజన్ కోసం గోవాలో చేరడం సంచలనంగా మారింది. అతను గోవాకు ఎందుకు మారడని అభిమానులలో ఇప్పటికీ ఒక ప్రధాన చర్చనీయాంశంగా ఉంది. 25-26 సీజన్ నుండి ఎలైట్ గ్రూప్‌లో పోటీ పడే హక్కులను సంపాదించిన గోవా తరపున ఆడేందుకు ముంబై క్రికెట్ అసోసియేషన్ నుంచి %చీూజ% కోసం జైస్వాల్ అభ్యర్థించాడు. గోవా తనకు కెప్టెన్సీ ఆఫర్ చేసినందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని జైస్వాల్ అన్నాడు. "గోవా నాకు కొత్త అవకాశాన్ని ఇచ్చింది, నాకు నాయకత్వ పాత్రను అందించింది.నా మొదటి లక్ష్యం భారతదేశానికి బాగా రాణించడమే, నేను జాతీయ డ్యూటీలో లేనప్పుడల్లా, గోవా తరపున ఆడుతూ డొమెస్టిక్ టోర్నమెంట్‌లో ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తాను" అని జైస్వాల్ పేర్కొన్నాడు. అయితే జైస్వాల్ ముంబై జట్టును వీడేందుకు మరో కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలె రహానెతో జరిగిన గొడవే అందుకు కారణం అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జమ్మూ కశ్మీర్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా జైస్వాల్ కెప్టెన్ రహానే కిట్‌ను తన్నాడని సమాచారం. ముంబై కోచ్ ఓంకార్ సాల్వి, కెప్టెన్ రహానే.. జైస్వాల్ నిబద్ధతను ప్రశ్నించడంతో, యువ ఓపెనర్ కోపంగా ఉన్నాడని తెలుస్తోంది. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, వెస్ట్ జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో, ప్రత్యర్థి బ్యాట్స్‌మన్‌పై పదేపదే స్లెడ్జింగ్ చేసినందుకు జైస్వాల్‌ను కెప్టెన్ రహానే బయటికి పంపించాడు. జైస్వాల్ సౌత్ జోన్ బ్యాట్స్‌మన్ రవితేజను స్లెడ్జింగ్ చేస్తుండగా, అంపైర్ పదే పదే హెచ్చరించినప్పటికీ, జైస్వాల్ ఆగలేదు.అతను లైన్ దాటుతున్నానని భావించిన రహానే.. జైస్వాల్‌ను గ్రౌండ్ వదిలి బయటికి వెళ్లాలని ఆదేశించాడు. ఈ విషయంలో రహానెపై జైస్వాల్ కోపం పెంచుకున్నట్లు తెలుస్తోంది.

# మోక్షజ్ఞ తొలి సినిమా కోసం రంగంలోకి మరో డైరెక్టర్ ఇప్పటికైన మోక్షం వచ్చినట్టేనా?



నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం నందమూరి అభిమానులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురు చూస్తున్నారు. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో మోక్షజ్ఞ సినిమాను అనౌన్స్ చేసిన ఈ సినిమా షూటింగ్ పలు కారణాల వలన ఆగిపోయిందని తెలుస్తుంది. కారణాలు అయితే ఇప్పటి వరకు బయటకు రాలేదు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తల ప్రకారం ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్ నుంచి ఔట్ అయ్యాడని, అందుకే సినిమా ఆగిపోయిందని టాక్ గట్టిగా వినిపించింది. కాని ఇంత వరకూ అఫీషియల్ గా మాత్రం ఏ విషయం బయటకు రాలేదు. మోక్షజ్ఞ కోసం డైరెక్టర్ వెంకీ అట్లూరి ఓ మంచి కథను రెడీ చేశారని తెలుస్తోంది. ఈ కథ బాలయ్య కూడా విన్నారని ..దాంతో వెంకీతో మోక్షజ్ఞ సినిమా ఫిక్స్ అయినట్టు సమాచారం. మరోవైపు బాలయ్య సూపర్ హిట్ మూవీ ఆదిత్య 369 సీక్వెల్ తో మోక్షజ్ఞ.. హీరోగా ఎంట్రీ ఇస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా ఆ విషయంపై ఆదిత్య 369 డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు స్పందించారు. తమ మూవీ సీక్వెల్ కోసం అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. అందుకే స్క్రిప్ట్ కూడా సిద్ధం చేశాం. ఆదిత్య 369 సీక్వెల్ తో బాలయ్య.. మోక్షును ఇండస్ట్రీకి పరిచయం చేయాలని అనుకుంటున్నారు. ఎప్పటికైనా సీక్వెల్ చేయాలని మాత్రం బాలయ్య మనసులో ఉంది. అంటే సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఆదిత్య 369 సీక్వెల్ ఉంటుందని అర్థమవుతుంది. అయితే వెంకీ అట్లూరి మోక్షజ్ఞ కోసం ప్రత్యేకంగా ఒక స్టోరీ సిద్ధం చేసినట్లు సమాచారం. బాలకృష్ణ కూడా ఈ సినిమా స్టోరీ వినాలనుకుంటున్నారని, కథ నచ్చితే వెంటనే సినిమా షూటింగ్ పనులు ప్రారంభం అవుతాయని తెలుస్తుంది. ఈ సినిమాలో మోక్షజ్ఞ లవర్ బాయ్ పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. ఇలా మోక్షజ్ఞ సినిమాకు సంబంధించి తరచూ ఏదో ఒక వార్త వస్తున్నప్పటికీ ఆయన ఏ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తారనేది సస్పెన్స్‌గా మారింది.




## ఓటీటీలో తమిళ హిట్ సినిమా.. తెలుగులో స్ట్రీమింగ్

కోలీవుడ్‌లో తెరకెక్కిన 'పెరుసు' సినిమా ఎవరూ ఊహించని విధంగా విజయం సాధించింది. ఇప్పుడు ఈచిత్రం ఓటీటీలో విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇందులో నటుడు వైభవ్‌తో పాటు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక కీలక పాత్రలలో మెప్పించారు. ఆపై సునీల్ రెడ్డి, బాల శరవణన్, రెడిన్ కింగ్స్‌లీ, చాందిని తమిళరసన్ నటించారు. 'టాంటిగో' (శ్రీలంక చిత్రం) ఆధారంగా 'పెరుసు' మూవీని దర్శకుడు ఇళంగో రామ్ తెరకెక్కించారు. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్, బవేజా స్టూడియోస్, ఎంబర్ లైట్ స్టూడియో సంయుక్తంగా నిర్మించాయి. మార్చి 14న కోలీవుడ్‌లో మాత్రమే విడుదలైన పెరుసు చిత్రం మంచి విజయాన్ని దక్కించుకోవడమే కాకుండా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. కథ తెగనచ్చేసిందంటూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. థియేటర్ రన్ పూర్తి చేసుకున్న పెరుసు ఏప్రిల్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు రానుంది. తమిళ్, తెలుగు,

## జి.డి. నాయుడు బయోపిక్‌లో శివానీ రాజశేఖర్

ఆర్. మాధవన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'జి.డి.ఎన్' అనే టైటిల్‌ను ఇప్పటికే ఖరారు చేశారు. భారత ప్రముఖ ఇంజనీరు జి.డి. నాయుడు జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో రాజశేఖర్, జీవితల కుమార్తె కూడా నటిస్తున్నారు. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా, మిరాకిల్ మేన్, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూరు' వంటి పేర్లను గడించిన గోపాల స్వామి దొరైస్వామి నాయుడు షార్ట్‌గా జి. డి. నాయుడు అని కూడా అంటారు. ఇప్పుడు ఆయన జీవితం ఆధారంగా 'జి.డి.ఎన్' మూవీ తెరకెక్కుతోంది. ఈ బయోపిక్‌కు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేశారు. ప్రియమణి, జయరాం, యోగిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. జీడీ నాయుడు బయోపిక్‌లో టాలీవుడ్ హీరోయిన్ శివానీ రాజశేఖర్ కూడా నటించనుంది. ఇందులో మాధవన్‌తో పాటుగా బిగ్ స్క్రీన్‌పై ఆమె కనిపించనున్నారు. త్వరలో ఈ మూవీ సెట్స్ మీదకు వెళ్తుండటంతో ఏర్పాట్లు స్పీడ్‌గా చేస్తున్నారు. కోయంబత్తూరుకు చెందిన జి.డి నాయుడు కేవలం మూడో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కానీ, ఆటోమొబైల్, అగ్రికల్చర్, టెక్స్‌టైల్, ఫొటోగ్రఫీ వంటి సెక్టార్స్‌లో కొన్ని పరికరాల ఆవిష్కరణలు చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ఫీల్డ్‌లో విప్లవం సృష్టించారని చెప్పవచ్చు. భారతదేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ మోటార్‌ను రూపొందించింది ఆయనే కావడం విశేషం. అందుకే అయన్ను ఎడిసన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారు. 1893లో జన్మించిన ఆయన 1974లో మరణించారు. ఈ మధ్యకాలంలో మాధవన్ నటిస్తున్న రెండో బయోపిక్ ఇది. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా (2022)లో నటించడంతో పాటు డైరెక్షన్ కూడా చేసి మెప్పించారు మాధవన్. ఈ సినిమాకు జాతీయ అవార్డు వచ్చింది. ఇప్పుడు మళ్లీ మరో బయోపిక్‌లో మాధవన్ నటిస్తుండటం విశేషం. మరి... వెండితెరపై మిరాకిల్ మేన్‌గా మాధవన్ ఏ స్థాయిలో ప్రేక్షకులను మెప్పిస్తారో చూడాలి.






## '14 రోజులు గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో' చిక్కుకుపోతే..

### ఓటీటీలోకి వచ్చేసిన మూవీ.!

తెలుగు యువ నటులు అంకిత్ కొయ్య, శ్రియా కొంతం జంటగా రూపొందిన రొమాంటిక్ లవ్‌స్టోరీ '14డేస్ గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో'. ఈ సినిమాకు శ్రీహర్ష దర్శకత్వం వహించగా.. సత్య నిర్మించాడు. మార్చి 07న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో నడిచింది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ ప్రస్తుతం ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హర్ష (అంకిత్ కొయ్య) ఎప్పుడు ఫిల్మ్ మేకర్ అవ్వాలని కలలు కంటూ ఉంటాడు. అయితే ఈ క్రమంలోనే హర్షకి ఒక డేటింగ్ యాప్‌లో ఆహాన (శ్రియ కొంతం) అనే అమ్మాయి పరిచయం అవుతుంది. ఇద్దరి స్నేహం కాస్తా ప్రేమగా మారుతుంది. ఆహాన తల్లిదండ్రులు ఒక రోజు పెళ్లికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేరని హర్షను తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తుంది. అలా తన గర్ల్‌ఫ్రెండ్‌ను కలవడానికి వెళ్లిన హర్షకు అదే ఇంట్లో 14 రోజులు ఉండాల్సి వస్తుంది. ఆహాన తల్లిదండ్రులకు, తాతకు తెలియకుండా హర్ష ఆ ఇంట్లో అన్ని రోజులు ఎలా గడిపాడు? హర్షను దాచడంలో ఆహాన ఎలాంటి కష్టాలు పడింది? పెళ్లికి వెళ్లిన ఆమె తల్లిదండ్రులు ఎందుకు అనుకోకుండా త్వరగా తిరిగి వచ్చారు? ఆహానకు ఎదురైన మరో సమస్య ఏమిటి? ఆ సమస్య నుంచి ఆహాన, హర్ష ఎలా తప్పించుకున్నారు అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే ఈ సినిమాను తప్పక

PUBLISHER, PRINTER &OWNED BY M PUSHPAVATHI H. NO:10-80/4,VIGNESHWARA COLONY, MARLU, MAHABUB NAGAR, TELANGANA -509001. PRINTED BY MYTHRI ART PRINTERS 10 DCC COMPLEX, MAHABUB NAGAR, TELANGANA. EDITER : SRINIVAS PARREPATI H NO:6-1262,ROAD -20, PARVATHAPUR, MEDIPALLY, MEDCHAL -MALKAJGIRI, TELANGANA -500098, TELTEL/2016/69844, PH: 9010899869, GMAIL : telanganachethanam@gmail.coms